
తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : దర్శం నారాయణ
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
29 జూలై 2024
సంపుటి : 02
సంచిక : 55
పేజీలు : 10
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## అథ్లెట్లను ఉత్సాహపరచండి



### మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ**

దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ 'పారిస్ ఒలింపిక్స్'లో ఆడేందుకు వెళ్లిన అథ్లెట్లను ప్రజలంతా ఉత్సాహపరచాలని, అథ్లెట్లకు శుభాకాంక్షలు చెప్పాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కోరారు. ప్రధాని తన రేడియో షో 'మన్ కీ బాత్' 112వ ఎపిసోడ్‌లో ఆదివారం మాట్లాడారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గత ఏడాది మాదిరిగానే 'హర్ ఘర్ తిరంగా' ప్రచారాన్ని

-మిగతా 2 లో



### గృహజ్యోతి పథకం
## అర్హులకు అందేనా?

- అర్హులైన వారికి అందని ద్రాక్షగానే.. ఇంటి పథకం
- దరఖాస్తులు సకాలంలో అందించినా.. నమోదు నిర్లక్ష్యంగానే
- తెల్ల రేషన్ కార్డులున్నవారు మాత్రమే అర్హులు అనడంతో.. మరోవైపునకు కథ

**తరంగాలు-మేడ్చల్,**

సాధారణ ప్రజలకు ఎన్నో ఆశలు చూపి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అయితే, గృహజ్యోతి పథకం అర్హులకు అందేనా? అన్న అనుమానాలు అనేకం సామాన్య ప్రజానీకంలో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు ఆందోళన చెందుతున్నారు. తెలుపు రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలకు ఉచిత కరెంట్ అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. రెండు వందల యూనిట్లలోపు గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించే గృహలక్ష్మి పథకం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని అర్హులైన వారికి అందడం లేదన్న ఆరోపణలు

-మిగతా 2 లో

# రాజకీయ ఉద్దండుడు జైపాల్ రెడ్డి



- ఎత్తుగడల్లో వైఫల్యం వల్లే 2014లో అధికారానికి దూరం
- కల్వకుర్తికి 100 పడకల ఆస్పత్రి మంజూరు
- ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ. 180 కోట్లు
- హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి నాలుగు లైన్‌ల రోడ్డు జైపాల్‌రెడ్డి ఐదో వర్ధంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- కొత్త చౌరస్తాలో కాంస్య విగ్రహావిష్కరణ



**తరంగాలు-మహబూబ్‌నగర్**

రాజకీయ ఉద్దండులు, తెలంగాణ దార్శనికులు సూదిని జైపాల్ రెడ్డి ఈ ప్రాంత వాసి కావడం మనందరికీ గర్వకారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బిల్లు వస్తుందో రాదో అన్న సందేహంలో యువత ఆత్మ బలిదానాలు చేసుకుంటుంటే పార్లమెంటులో బిల్లును ఆమోదింపజేసిన ఘనత జైపాల్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల కేంద్రంలోని కొత్త చౌరస్తాలో జైపాల్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు

-మిగతా 2 లో

### తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్ పై కేసు

- వాణిజ్య పన్నుల శాఖలో రూ.1000 కోట్ల స్కాం
- 75 కంపెనీలు అవకతవకలకు పాల్పడినట్టు గుర్తింపు

2




### ఉచిత ఎల్ఆర్ఎస్ ఉత్తమాటే
#### కాంగ్రెస్ సర్కారుపై హరీశ్‌రావు ఫైర్

**హైదరాబాద్**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామంటూ మాట ఇచ్చిందనీ, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని మాజీ మంత్రి తన్నీరు

-మిగతా 2 లో





### తెలంగాణ విద్యార్థిని మృతి

- కోచింగ్ సెంటర్‌లో వరద
- విద్యార్థుల ఆందోళన
- సిపిఎం ఎంపీల సంఘీభావం
- దోషులను శిక్షించాలి: ఎస్ఎఫ్ఐ

**న్యూఢిల్లీ బ్యూరో**

భారీ వర్షాలకు రావూస్ ఐఎఎస్ కోచింగ్ సెంటర్‌లోకి వరద వచ్చి ముగ్గురు విద్యార్థులు చనిపోయిన ఘటన ఢిల్లీని కుదిపేసింది. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో నిర్వాహకులు భద్రతాపరమైన కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ ఉపద్రవానికి కారణమని విమర్శిస్తూ విద్యార్థులు కోచింగ్ సెంటర్ ఎదుట ఆందోళనకు దిగారు. వీరికి ఎస్ఎఫ్ఐ బాసటగా నిలిచింది.

-మిగతా 2 లో

# కమిషన్ల కక్కుర్తి వల్లే మేడిగడ్డ కుంగింది



- ఉత్తర తెలంగాణకు నీళ్లు రాకుంటే మాజీ సీఎం కేసీఆరే కారణం
- కేటీఆర్‌వి పిచ్చి మాటలు
- ఆధారాలు ఉంటే ఘోష్ విచారణ కమిషన్‌కు ఇవ్వండి
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**తరంగాలు-హైదరాబాద్**

మేడిగడ్డ బరాజ్ కుంగింది కేసీఆర్ సర్కారు కమిషన్ల కక్కుర్తి వల్లే అని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన తెలిసీ తెలియని రీ డిజైనింగ్, రీ ఇంజినీరింగ్ వల్లే ఇంతటి అనర్థం జరిగిందనీ, వేలకోట్ల సొమ్ము నీళ్లపాలయ్యిందని విమర్శించారు. దీనికి కచ్చితంగా మాజీ సీఎం కేసీఆరే బాధ్యత వహించాలని చెప్పారు. ఆదివారంనాడిక్కడి జలసౌధలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి కే తారకరామారావు పిచ్చి కూతలు కూయడం మానుకోవాలని హితవు పలికారు. మేడిగడ్డ కుంగుబాటుకు కాంగ్రెస్ మంత్రులపైనే అనుమానాలు వస్తున్నాయని ఆయన చేసిన ఆరోపణలు సత్యదూరమనీ, దానికి సంబంధించిన ఆధారాలు ఏవైనా ఉంటే జస్టిస్ ఘోష్ విచారణ కమిషన్‌కు ఇవ్వాలని సూచించారు. కేసీఆర్ కుటుంబం ధనదాహంతో నీటిపారుదల రంగాన్ని

-మిగతా 2 లో



### బోనమెత్తిన భాగ్యనగరం

- వైభవంగా లాల్ దర్వాజా బోనాలు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

**తరంగాలు -చాంద్రాయణగుట్ట**

భాగ్యనగరం బోనమెత్తింది. ఆదివారం నగరవ్యాప్తంగా ఆషాడమాస బోనాల జాతర ఉత్సాహంగా సాగింది. పాతబస్తీలో లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి బోనాలతో పాటు భాగ్యలక్ష్మి అమ్మవారు, ఇతర ప్రముఖ

-మిగతా 2 లో

## అథ్లెట్లను ఉత్సాహపరచండి

(మొదటి తరువాయి)
పునఃప్రారంభించాలని, త్రివర్ణ పతాకంతో ఉన్న తమ సెల్ఫీలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇటీవల యునెస్కో వరల్డ్ హెరిటేజ్ ప్రదేశంగా గుర్తింపు పొందిన అస్సాంలోని 'చరైడియో మైదాం' గురించి ప్రధాని మోడీ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ ప్రదేశాన్ని తమ భవిష్యత్తు పర్యటన షెడ్యూల్‌లో ప్లాన్ చేసుకోవాలని ప్రజలను కోరారు. మరోవైపు అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో పాల్గొన్న వారితో ప్రధాన మంత్రి మాట్లాడారు. 'ఇంటర్నేషనల్ మేథమెటిక్స్ ఒలింపియాడ్‌లో వంద కంటే ఎక్కువ దేశాల నుంచి యువకులు పాల్గొంటారు. మన జట్టు విజయవంతంగా తొలి ఐదు స్థానాల్లో నిలిచింది' అని మోడీ ప్రశంసించారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ఈ విద్యార్థుల పేర్లు పూణేకు చెందిన ఆదిత్య వెంకట్ గణేష్, సిద్ధార్థ్ చోప్రా, ఢిల్లీకి చెందిన అర్జున్ గుప్తా, గ్రేటర్ నోయిడాకు చెందిన కనవ్ తల్వార్, ముంబాయికి చెందిన రుషీల్ మాథుర్, గౌహతికి చెందిన ఆనందో భాదురిలను ప్రధాని మోడీ ప్రస్తావించారు.

## గృహజ్యోతి పథకం అర్హులకు అందేనా?

(మొదటి తరువాయి)
**-గృహజ్యోతి పథకానికి వచ్చిన దరఖాస్తులు 5,50 లక్షలు**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలో రేషన్ కార్డులు 5,23,899 ఉండగా, గృహ విద్యుత్ వినియోగదారులు 15,14,262 మంది ఉన్నారు. అయితే, గృహలక్ష్మి పథకానికి సుమారు 5,50 పైచిలుకు మంది నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొంత మందికి మాత్రమే గృహలక్ష్మి పథకం వర్తించేలా చేస్తున్నారని, సగానికి పైగా రేషన్ కార్డులు ఉండి 200 యూనిట్ల విద్యుత్ వాడుతున్న వారికి గృహలక్ష్మి పథకం వర్తింపు జరగడం లేదన్న ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు దరఖాస్తులు అందించినా దరఖాస్తుల నమోదును నిర్లక్ష్యం చేయడం మూలంగానే అర్హులకు గృహజ్యోతి పథకం అందడంలేదు. అయితే, అర్హులైన వారికి గృహలక్ష్మి పథకం అందేలా తిరిగి జిల్లా కలెక్టరేట్, మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాలలో తిరిగి దరఖాస్తులను చేసుకునేలా సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినా, ఎంత వరకు సఫలీకృతం అవుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. కాగా, రేషన్ కార్డులు ఉన్న వారికే ఈ పథకం వర్తిస్తుందని, అయితే, అనేక మంది నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసిన నేపథ్యంలో త్వరితగతిన నూతన రేషన్ కార్డులు అందించి గృహజ్యోతి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల వద్ద తిరిగి దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

## ఉచిత ఎల్‌ఆర్‌ఎస్ ఉత్తమాటే

(మొదటి తరువాయి)
హరీశ్‌రావు ఫైరయ్యారు. 'నో ఎల్‌ఆర్‌ఎస్%ా%నో బీఆర్‌ఎస్' అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రె ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఫీజు వసూలు చేస్తున్నదని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ హామీ ప్రకారం ఫీజులు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న నేరాలపై సీఎం ఇంతవరకు పోలీసులతో సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 500 హత్యలు జరిగాయన్నారు. హత్యలు, అత్యాచారాలు యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వానికి, పోలీసులకు చీమ కుట్టినట్టయినా లేదని విమర్శించారు. శాంతి భద్రతల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాజకీయాలకు అతీతంగా సీఎం స్పందించి రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్ పై కేసు

**-వాణిజ్య పన్నుల శాఖలో రూ.1000 కోట్ల స్కాం**
**- 75 కంపెనీలు అవకతవకలకు పాల్పడినట్టు గుర్తింపు**

హైదరాబాద్: తెలంగాణలో వాణిజ్య పన్నుల శాఖలో భారీ కుంభకోణం జరిగింది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ చెల్లింపుల్లో రూ.1000 కోట్ల మేర అవకతవకలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు. 75 కంపెనీలు అవకతవకలకు పాల్పడినట్టు ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెల్లడైంది. కమర్షియల్ టాక్స్ కమిషనర్ రవి ఫిర్యాదుతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దీంతో తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి (మాజీ సీఎస్) సోమేశ్‌కుమార్‌తో పాటు పలువురిపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. కమర్షియల్ టాక్స్ అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లపై కేసు నమోదైంది. నిందితులపై 406, 409, 120(బి) ఐటీ చట్టం కింద సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.
వాణిజ్యపన్నుల శాఖలో వేళ్లూనుకున్న అక్రమార్జన..
విచారణలో ఉన్న సంస్థలు చెల్లించాల్సిన పన్నులు కూడా చెల్లించడం లేదు. తమ కస్టమర్‌లు తప్పుడు పద్ధతుల్లో ఇన్‌పుట్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించారని ఆరోపణలు ఉన్నాయి. తాము చెల్లించాల్సిన పన్నును తగ్గించి, తద్వారా ఆదాయాన్ని ద్వంద్వ నష్టానికి దారితీస్తున్నట్టు అధికారిక వర్గాలు గుర్తించాయి. ఈ విషయంపై కమర్షియల్ టాక్స్ కమిషనర్ టి.కె.శ్రీదేవిని సంప్రదించినప్పుడు, మోసంపై లోతైన దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. అయితే విచారణ జరుగుతుందని తెలియటంతో..తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయన్న భయంతో పలువురు అధికారులు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలిసింది.. .

# రాజకీయ ఉద్దండుడు జైపాల్ రెడ్డి

(మొదటి తరువాయి)
చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో సర్పంచులు మొదలుకొని ఎమ్మెల్యేల దాకా జైపాల్ రెడ్డి శిష్యులమేనని ఇప్పటికీ చెప్పుకుంటున్నారంటే అది ఆయన రాజకీయ విలువలకు నిదర్శనమని తెలిపారు. ఒక రాజకీయ నాయకుడిగానే గాక ఒక సిద్ధాంతకర్తగా, లోతైన విశ్లేషకునిగా.. అంతర్జాతీయ స్థాయిలో మెప్పు పొందిన వ్యక్తి అని గుర్తు చేశారు. చివరి శ్వాస వరకూ ఎక్కడా రాజీ పడకుండా ప్రజాస్వామ్య, లౌకిక రాజకీయాలకు ఊతం ఇచ్చేవారన్నారు. ఈ ప్రాంతంలోని మిడ్జిల్ నుంచి జడ్పీటీసీగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన తాను ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షునిగా చివరికి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానంటే జైపాల్ రెడ్డే తనకు మార్గదర్శకులని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో సీఎం అభ్యర్థిని ప్రకటించకపోవడం వల్లనే ప్రజలు కాంగ్రెస్‌ను అధికారానికి దూరంగా పెట్టారని తెలిపారు. తల్లిని చంపి బిడ్డను బతికించుకున్నారన్న మోడీ మాటలు తెలంగాణ రాష్ట్రం పట్ల ఆయనకున్న కపట ప్రేమను తెలియజేస్తున్నాయన్నారు.
కల్వకుర్తిలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తండాల్లో బీటీ రోడ్లతో పాటు ఆర్‌అండ్‌బీ రోడ్లు, గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.180 కోట్లు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఆమనగల్ మండల కేంద్రంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలకు మౌలిక వసతులతో పాటు పక్కాభవనాలు నిర్మించి ఇస్తామన్నారు. మాడుగుల మండలానికి అండర్ గ్రౌండ్ డ్రయినేజీ కోసం రూ.10 కోట్లు ఇస్తామన్నారు. తాండ్ర, వెల్దండ పాఠశాలల అభివృద్ధికి తలా రూ.5కోట్లు ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్నో ఏండ్ల నుంచి నిరుద్యోగులు ఎదురుచూస్తున్న స్కిల్ యూనివర్సిటీకి రూ. 100 కోట్లతో కడ్తాల మండలం ముచ్చర్లలో మూడు రోజుల్లో భూమి పూజ చేయబోతున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే రుణమాఫీలో భాగంగా లక్ష రుణం మాఫీ చేశామని, ఈ నెల చివరి కల్లా రెండో విడత పూర్తి చేస్తామని, ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షలు మాఫీ చేసి తీరుతామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రూ.500కే సిలిండర్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇప్పటికే అమలు చేస్తున్నట్టు చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రాడని కొడుకు ప్రకటిస్తే.. కేసీఆర్ మాత్రం అర్ధగంట ముందే అసెంబ్లీకి రావడం శోచనీయమన్నారు. కేసీఆర్ ఎంత మొత్తుకున్నా ప్రయోజనం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడగొడితే పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారని, స్థానిక ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు.

# బోనమెత్తిన భాగ్యనగరం

(మొదటి తరువాయి)
దేవాలయాల్లో బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే అమ్మవార్ల దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తి, శ్రద్ధలతో అమ్మవారికి మహిళలు, భక్తులు బోనం సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. దాంతో భక్తజనంతో దేవాలయాలన్నీ కిటకిటలాడాయి. దేవాలయాల పరిసర ప్రాంతాలన్నీ జన సందోహంగా మారాయి. పోతురాజుల విన్యాసాలు, తొట్టెల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోనాలు తీసుకువచ్చే మహిళల కోసం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో పాతనగరంలో లాల్ దర్వాజా బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన సతీమణి మల్లు నందిని అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు.డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. బోనాల పండుగ భూమి పుత్రులు జరుపుకునే పండుగని, అందుకని ఈ పండుగకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నగరంలో బోనాల పండుగ విజయవంతం కోసం ప్రభుత్వం తరపున సకల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి పటిష్టమైన పునాదులు వేయడానికి ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.పది వేల కోట్లు కేటాయించామని తెలిపారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. గోల్కొండ బోనాలతో ప్రారంభమై, ఉజ్జయిని మహంకాళి బోనాలు, లాల్ దర్వాజా సింహవాహిని బోనాలు ఘనంగా జరుగుతున్నాయని, బోనాలు అంటే హైదరాబాద్ సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శమన్నారు.

**భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరుకున్నారు. పాతబస్తీలో బోనాల సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రభుత్వం తరపున కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. గతేడాది వర్షాల్లేక.. రైతులంతా ఇబ్బందిపడ్డారని, ఈసారి అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు పడాలన్నారు. పాడి పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, అఖిలపక్ష నిర్ణయానికి అనుగుణంగా పాత డిజైన్‌తో కొత్త ఉస్మానియా దవాఖాన నిర్మిస్తామన్నారు. మూసీనది ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. పాతబస్తీ స్థితిగతులను మార్చేందుకు మెట్రోను విస్తరిస్తున్నామన్నారు. పోటీ చేసిన సగం సీట్లలో డిపాజిట్లు రానీ ఆ పార్టీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని బీఆర్‌ఎస్ పార్టీని ఉద్దేశించి అన్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..**

లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారిని.. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు దర్శించుకున్నారు. మంత్రి కొండా సురేఖ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజరు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అద్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తీన్మార్ మల్లన్న, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ ఖాన్, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు అచారి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య వీరిలో ఉన్నారు. అలాగే చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంతో పాటు పాతనగరంలోని ప్రముఖ దేవాలయాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి దర్శించుకొని.. అమ్మవార్లకు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు.
నేడు రంగం, ఘటాల ఊరేగింపునకు ఏర్పాట్లు

# కమిషన్ల కక్కుర్తి వల్లే మేడిగడ్డ కుంగింది

(మొదటి తరువాయి)
సర్వనాశనం చేశారనీ, వాస్తవాలను వక్రీకరించడం గులాబీదండుకు వెన్నతో పెట్టిన విద్య విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యలు కూడా దానిలో భాగమేననీ, ఇప్పటికైనా గోబెల్ ప్రచారం ఆపాలని హితవు పలికారు. అసలు సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి తీసుకోకుండా రూ.94 వేల కోట్లు ఎలా ఖర్చు చేశారని ప్రశ్నించారు. పార్లమెంటు చట్టం ద్వారా జాతీయ ఆనకట్టల భద్రతా పర్యవేక్షణ సంస్థ(ఎన్డీఎస్ఏ) ఏర్పడిందనీ, దానిలో దేశంలోనే పేరొందిన ఇంజినీరింగ్ నిపుణులు ప్రతినిధులుగా ఉన్నారని తెలిపారు. వారి సలహా మేరకే పంపింగ్ నిలుపుదల చేశామన్నారు. మేడిగడ్డకు పంపింగ్ చేస్తే ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తుందనీ, దానితో పాటు సమ్మక్క-సారక్క ప్రాజెక్ట్ కొట్టుకు పోతుందనీ, సీతారామ ప్రాజెక్టు డ్యామేజ్ అవుతుందనీ, 44 గ్రామాలతో పాటు సుప్రసిద్ధ భద్రాచలం దేవస్థానం కూడా ముంపునకు గురవుతుందని ఇంజినీరింగ్ నిపుణులు హెచ్చరించారని తెలిపారు. తాము ఎన్డీఎస్ఏ చెప్పినట్టు చేస్తామే తప్ప, కేసీఆర్, కేటీఆర్ చెత్త సలహాలను పాటించబోమని స్పష్టంచేశారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారంలను ఉపయోగంలోకి తేవాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఉత్తర తెలంగాణకు నీళ్లు రాకుంటే అక్కడ రైతాంగానికి కేసీఆరే కారణం అవుతారని అన్నారు. నాన్ బ్యాంకింగ్ కార్పోరేషన్‌ల నుంచి అధిక వడ్డీలతో అప్పులు చేశారన్నారు. "ప్రాజెక్ట్ పూర్తే కాలేదు. ఇప్పటికే వడ్డీ, అసలు కలిపి ఏడాదికి రూ.15 వేల కోట్లు కడుతున్నాం. ప్రాజెక్ట్ పూర్తి అయితే అసలు, వడ్డీ కలిపి ఏడాదికి రూ. 25 వేల కోట్లు కట్టాల్సి వస్తుంది" అని వివరించారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలంటే ఇంకా రూ.లక్షా 47 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందన్నారు. రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టిన చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేస్తే ప్రజలపై ఇంతటి ఆర్థిక భారం పడేది కాదని అభిప్రాయపడ్డారు. ఈప్రాజెక్ట్ పూర్తయితే విద్యుత్ బిల్లుల ఖర్చు సంవత్సరానికి రూ. వెయ్యి కోట్లు మాత్రమే అయ్యేవనీ, రీ-డిజైనింగ్, రీ-ఇంజినీరింగ్ వల్ల ఇప్పుడు కరెంటు బిల్లులు రూ.పదివేల కోట్లు వస్తున్నాయని తెలిపారు.

# తెలంగాణ విద్యార్థిని మృతి

(మొదటి తరువాయి)
సిపిఎం బృందం ఆ కోచింగ్‌సెంటర్‌ను సందర్శించి ఈ దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులను పరిశీలించింది. భద్రతాపరమైన నిబంధనలను నిర్వాహకులు తుంగలో తొక్కిన నిర్వాహకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ విషాదకర ఘటనలో చనిపోయిన ముగ్గురు విద్యార్థుల్లో తెలంగాణ విద్యార్థిని తాన్యా సోని ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని మూడంతస్థుల భవనంలోని బేస్‌మెంట్‌లో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న లైబ్రరీలో విద్యార్థులు చదువుకుంటుండగా ఒక్కసారిగా వరద ముంచెత్తింది. విషయం తెలియగానే అక్కడకు చేరుకున్న పోలీసు, అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే ముగ్గురు విద్యార్థుల మృతదేహాలను గుర్తించి, వెలికి తీశారు. మృతులను తెలంగాణకు చెందిన తాన్యా సోని, కేరళలోని ఎర్నాకులంకు చెందిన నవీన్ డాల్విన్, ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన శ్రేయాయాదవ్‌లుగా గుర్తించారు. ఈ దారుణ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రతిపక్ష నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోచింగ్ సెంటర్ ఎదుట విద్యార్థులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. విద్యార్థులు మరణించిన గదిని నిర్వాహకులు ప్లాన్‌లో స్టోర్ రూమ్‌గా పేర్కొన్నా, ఆ గదిని లైబ్రరీగా ఉపయోగిస్తున్నట్లు ఢిల్లీ మున్సిపల్ అధికారులు గుర్తించారు. వరదల సమయంలో ఈ గదిలో సుమారు 20 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఈ ఘటనతో నగరంలో మిగిలిన కోచింగ్ సెంటర్లలో కూడా తనిఖీలు ప్రారంభించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని అధికారులు ఆదివారం వెల్లడించారు. ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబెరారు మాట్లాడుతూ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో అక్రమంగా లైబ్రరీ నిర్వహిస్తున్నారని తెలిపారు.

# మూడు క్రిమినల్ చట్టాలరద్దుకు పిడికిలి బిగిద్దాం

**-సంఘటితంగా పోరాడుదాం**
**-పలువురు వక్తల పిలుపు**




**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :**
కేంద్ర ప్రభుత్వం జూలై 1వ తేదీ నుండి అమలులో వచ్చే విధంగా మూడు నూతన క్రిమినల్ చట్టాలను తీసుకొని రావటం జరిగిందని ఇది మన ప్రజాస్వామ్యం స్ఫూర్తి నీ కాలరాయడమే కాకుండా పౌర హక్కులను,స్వేచ్ఛను హరించే ప్రమాదకర చట్టాలని,ఈ మూడు క్రిమినల్ చట్టాల రద్దుకు మనమంతా బిగించడ మే కాకుండా వీటి రద్దుకు సంఘటిత పోరాలకు సిద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక టీటీడీసీ కాన్ఫరెన్స్ హాలులో మూడు నూతన క్రిమినల్ చట్టాలపై వీరనారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షురాలు షేక్. నజిమా అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో హై కోర్ట్ అడ్వకేట్ యం డి.సాదిక్ అలీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 90% శాతం పాత చట్టాలను యధాతథంగా కొనసాగిస్తూ పది శాతం చట్టాలను మార్చి మూడు నూతన క్రిమినల్ చట్టాలను ఈ కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రవేశపెట్టి ఈ సంవత్సరం అమలులో తీసుకొచ్చిందని పేర్కొన్నారు.ప్రకారం మాట్లాడటం ప్రశ్నించడం విమర్శించటం కూడా అతిపెద్ద నేరాలుగా పరిగణిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో 15 రోజుల పాటు రిమాండ్ విధించే ఆనవాయితీ ఈ చట్టాన్ని అనుసరించి,60 నుండి 90 రోజుల వరకు పొడిగించడం విశేషం అన్నారు. పార్లమెంట్ లో నేరస్తులే చట్టాలు చేసే పరిస్థితి ఉండగా న్యాయం జరుగుతుందని ఆశించటం అవివేకం అన్నారు. కోర్టులలో జరిగే కాలాయాపన పరిస్థితులను మార్చే బదులు ఈ మూడు క్రిమినల్ చట్టాలను తీసుకొని రావటం వెనుక ప్రజాస్వామ్యం స్ఫూర్తి దెబ్బతీసే ఉద్దేశం కనిపిస్తుందన్నారు.నిరసన ప్రదర్శనలలో జరిగే చిన్న చిన్న యాదృచిక ఘటనలను మూక దాడులు కింద యావజ్జీవ కారగారా శిక్ష విధించే వెసులు బాటును ఈ చట్టాలు కల్పిస్తున్నాయి అన్నారు. కోర్టుల కేసు లలో జరిగే కాలా తీతం పరిస్థితులను కేసులు త్వరితగతంగా పరిష్కారం చెందే విధంగా అసలు చేయాల్సిన పని కాగా చేయకూడని చేయకూడని పనులే మన ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు.ఈ దేశంలో పెద్ద పెద్ద వారికి శిక్షలు లేకుండా చేసింది కే సామాజిక సేవలు అనే అంశాన్ని ఈ క్రిమినల్ చట్టాల్లో పొందుపరిచారని ఆరోపించారు.మనకు రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు ఈ క్రిమినల్ చట్టాలు దేశద్రోహం కింద అణచాలని కేంద్రంలోని పాలకులు చూస్తున్నారన్నారు. మనం వీటికి వ్యతిరేకంగా పిడికిలి బిగించడమే కాకుండా సంఘటిత పోరాటాలకు దిగాలని పిలుపునిచ్చారు. చట్టాలు రద్దు చేసే వరకు విశ్రమించకూడదని తెలిపారు. రిటైర్డ్ సీఐ పుల్లూరి నాగయ్య , సీనియర్ అడ్వకేట్ వంజాకుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లౌకికప్ భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చి కుట్రలో భాగంగానే ఈ మూడు నూతన క్రిమినల్ చట్టాలను తీసుకుని రావడం జరిగిందని ఆరోపించారు.గత పాలకులు ఆశించిన విధంగా 400 సీట్లు వారికి వస్తే మన రాజ్యాంగాన్ని మార్చేవారని ఆందోళన వ్యక్తం చేశారు.బ్రిటీషర్ల హయాంలో ప్రజల మా న, ప్రాణాలు కాపాడేందుకే తీసుకొచ్చిన మూడు రకాల ఐపీసీ సెక్షన్ లను సంస్కృత భాషలో ప్రవేశపెట్టారని,దీని వెనుక వారి ఉద్దేశాలు స్పష్టమవుతున్నాయి అన్నారు. ఫిర్యాది దారుడు, నిందితుడు అనే తేడా లేకుండా ఇరువురికి ఈ చట్టం వల్ల ఉపయోగం లేకుండా పోతుంది అన్నారు. ఈ మూడు రెండు చట్టాలు అత్యంత ప్రమాదకరమైన వని, వీటి రద్దుకు మనమంతా సంఘటిత శక్తిని ప్రదర్శించి, ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారు రాజ ద్రోహం అంటే నేటి పాలకులు దేశద్రోహం అంటున్నారని,ఇందుకు అనుగుణంగా చట్టాలను రూపొందించు కుంటున్నారని దుయ్యబట్టారు. యువం ఫౌండేషన్ వ్యవస్థాపకులు , ప్రముఖ పిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ నూతన 3 క్రిమినల్ చట్టాలపై జనహితం కోసం అవగాహన సదస్సు నిర్వహించటం అభినందనీయం అన్నారు. సభ అధ్యక్షురాలు న్యాయవాది షేక్. నజీమా మాట్లాడుతూ గతంలో మనం అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి డిమాండ్లు సాధించుకునే వారమని ఈ చట్టాల వల్ల అలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే మనకు యావత్ జీవ కారగార శిక్ష విధించే అవకాశం ఉందని అన్నారు. కనుక ఇలాంటి చట్టాల రద్దుకు మనమంతా ఐక్యమత్యంతో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.తొలుత ఫక్రుద్దీన్ తన పాటలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ సదస్సులో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్,వీర నారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి,నాయకులు జాన్ బీ , నస్రీన్, జ్యోతి,చందు , త్రివేణి,భవాని, నాగలక్ష్మి , కల్పన,ఉష ,శృతి,రమణి, ఝాన్సీ ,సంధ్య, సుశీల, లక్ష్మి , సుష్మ ,తారా దేవి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు వీరన్న నాయక్, దేవుల నాగేశ్వరావు , రవీందర్ నాయక్,శ్రీనివాస్ నాయక్,రమేష్ నాయక్, మహేష్, రాము,కృష్ణ ,హరి,సురేష్, లక్ష్మణ్,రవి, జగదీష్,బీసీ సంఘం నాయకులు మీగడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ఆకర్ష్ విజయవంతం

**-స్పీడు అందుకున్న కాంగ్రెస్**



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపాడు గ్రామం నుండి భారత రాష్ట్ర సమితి పార్టీ నుండి నాయకులు కార్యకర్తలు ఆదివారం రోజు ఎమ్మెల్యే ప్రభుత్వ ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్న నాయకత్వంలో కురుమ సంఘం అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వర్లు, సూగురు వీర సోమయ్య ,అశోక్, ప్రశాంత్ , అంబోజు కనకయ్య జాయిన్ కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ నగేష్,మాజీ ఎంపిటిసి కట్టెకొల హనుమంతు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు గౌడ్, మండల కో ఆప్షన్ మాజీ మెంబర్ ఎండి యూసుఫ్, బీర్ల ఫౌండేషన్ ఇంచార్జి బత్తిని ఉప్పలయ్య గౌడ్,రైతు సంఘం అధ్యక్షులు పోకల రామచంద్రు, ఇందూరు లింగయ్య, కోలా సత్తయ్య, ఇందూరు పరమేష్, ఆదివారం రోజు వలసలను ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున పార్టీని బలోపేతం చేస్తున్న గ్రామ శాఖ అధ్యక్షులు ఎగిరి యాదగిరి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. రానున్న కాలంలో కాంగ్రెస్ జెండా సంపూర్ణంగా గ్రామస్థాయిలో ఎగరాల అనే లక్ష్యంతో ముందుకు వెళుతుంది.

# మృతురాలు కుటుంబానికి ఆర్థిక చేయూత



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపహాడ్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన జీడి సాయమ్మ అనారోగ్యంతో అకస్మాత్తుగా మరణించడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,సిపిఐ మిత్రపక్షాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రైతురుణమాఫీ పైన రైతుల అభిప్రాయం తీసుకుంటున్న ప్రభుత్వం



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని యం తుర్కపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణాల మాఫీ చేసిన విషయంపై రైతుల స్పందన వారి అభిప్రాయాలను తీసుకుంటున్నారు . ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి దుర్గేశ్వరీ మరియు మండల రైతులు పాల్గొన్నారు . రైతుల స్పందన మరియు వారు హర్షం వ్యక్తం చేస్తున్నారని సంబందిత రాష్ట్ర వ్యవసాయ శాఖ బృందం తెలియచేశారు .

# రోగులు పట్ల సేవాభావంతో నడుచుకోవాలి

**-ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి తుమ్మల**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :**
ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులు పట్ల వైద్యులు సేవాభావంతో నడుచుకోవాలని సూచిస్తూ,ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వైద్య శాఖ అధికారులతో చర్చించి ఆసుపత్రిలో మందులు,వసతులు వైద్య సదుపాయాలు మరింతగా మెరుగుపరచేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్,ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అనిరుద్ అగస్త్య,ముఖ్య నాయకులు సాదు రమేష్ రెడ్డి, మిక్కిలినేని నరేంద్ర ,వడ్డేబొయిన నరసింహారావు, ఆళ్ల అంజిరెడ్డి, నాగాండ్ల దీపక్ చౌదరి,కమతం రామకృష్ణ, అబ్దుల్ రషీద్, కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నేతన్నలకు అండగా ప్రభుత్వం

**-ధన్యవాదాలు తెలిపిన నేతన్న ఏలూరి సుదర్శన్**



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఏలూరి సుదర్శన్ నేత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చేనేతకి ఉతమిచ్చేలా నేతన్నలకు అండగా ప్రభుత్వం పనిచేస్తుంది అని అన్నారు . అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో చేనేతకి పెద్ద పీట వేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు . హ్యాండ్లూమ్ , టెక్స్ టైల్స్ కి 355 కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్ పెట్టారని అన్నారు . ఈ 355 కోట్ల రూపాయల బడ్జెట్ లో చేనేత కార్మికులకు , హ్యాండ్లూమ్ , టెక్స్ టైల్స్ కి , గ్రామీణ స్థాయిలో చిన్న పరిశ్రమల ప్రోత్సాహనికి భారీగా నిధులు బడ్జెట్ లో పెట్టిన శుభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకి , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి , ఉత్తమ్ కుమార్ రెడ్డికి , కొండా సురేఖకి , ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి కృతజ్ఞతలు తెలిపారు .

# రాయలను సత్కరించిన ఖమ్మం గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో :**
గొరిల్లా పార్క్ లో ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కి ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేసి సాదు రమేష్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సాధు రమేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమలో ఉన్న సమస్యలను, పరిష్కారానికి తాము కట్టుబడి ఉన్నామని, పరిశ్రమలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.అలాగే మన వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు,డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క,రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి సమిష్టిగా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మరియు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పొలానికి వచ్చి పలకరించిన మంత్రి పొంగులేటి

**-పలకరించడంతో ఆనందం వ్యక్తం చేసిన మహిళా కూలీలు**



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో**
ఖమ్మం కూసుమంచి మండలంలో పొలాల గట్ల మీద మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఏం అక్కా ఎలా ఉన్నారు. ఓ చెల్లే.. పనులు ఎలా జరుగుతున్నాయి. ఏం రకం విత్తనాలు వేశారు.అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఇలా మహిళా కూలీలను ఆత్మీయంగా పలకరించి.. ఆనందింపజేశారు. ఆదివారం తురకగూడెం పర్యటన ముగించుకొని తిరిగి వస్తుండగా రోడ్డు వెంట ఓ పొలంలో నాటు వేస్తున్న కూలీలను చూసి తన వాహనాన్ని ఆపుజేయించారు. వారి వద్దకు వెళ్లి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. మహిళా రైతు అర్వపల్లి పద్మ, ఇతర మహిళా కూలీలతో మాట్లాడి స్థానికంగా సాగు వివరాలను ఆరా తీశారు. పిల్లలు ఏం చదువుతున్నారు. అంతా బాగే కదా అంటూ ఆప్యాయంగా మాట్లాడారు. దీంతో వారంతా కరచలనాలు చేసి.. శీనన్నా.. అంతా బాగున్నాం అన్న.. చాలా సంతోషం అన్నా అంటూ.. ఆనందంతో ఆ నారీమణులు పులకరించారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయండి



**-ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు మంత్రి తుమ్మల ఆదేశాలు**

**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో**

ఖమ్మం నియోజక వర్గంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సమస్యల పై జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ తో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు.జర్నలిస్ట్ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి సత్వరమే ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఖమ్మం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి తుమ్మల జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ తో క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో చర్చించి ఖమ్మం నగరంలో అవసరమున్న చోట ఖబరస్థాన్, షాది ఖానా ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం ఉండేలా చూడాలన్నారు.శిథిలావస్థ లో ఉన్న సోషల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ తో పాటు ఇతర ప్రభుత్వ స్కూల్స్ ఏవైనా ఉంటే తక్షణమే ఖాళీ చేసి వాటిని కూల గొట్టి నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అవసరమున్న చోట తాత్కాలిక భవనాల్లో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలనీ మంత్రి తుమ్మల సూచించారు. ఖమ్మం కార్పొరేషన్ లో శానిటేషన్ విషయంలో అపరిశుభ్రత ఉందని,అసౌకర్యంగా ఉందని ప్రజల నుంచి పిర్యాదులు ఉన్నాయని మున్సిపల్ కమిషనర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఖమ్మం నగరంలో వరద నీరు ఎక్కడ నిలవకుండా డ్రైనేజ్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా మెరుగు పరచాలని సూచించారు. సారథి నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సత్వరమే ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. గోళ్ళ పాడు ఛానల్ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ స్థలాల్లో పరిశుభ్రత ఉండేలా యజమానులకు తగిన ఆదేశాలు జారీ చేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పౌర సమాజానికి పెను విపత్తుగా మారిన గంజాయి డ్రగ్స్ మహమ్మారి ఖమ్మం లో కనపడకుండా చేయాలన్నారు. వెలుగు మట్ల అర్బన్ పార్క్ ప్రజలకు ఆహ్లాదం పంచేలా మౌలిక వసతుల కల్పన చేయాలనీ.. మెయిన్ రోడ్ నుంచి పార్క్ వరకు రహదారి మంజూరు అయింది నిర్మాణం సత్వరమే చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశాలు ఇచ్చారు. అర్బన్ పార్క్ లో ఆహ్లాదం కోసం ఏయే శాఖలు నిర్మాణం చేపట్టాలో శాఖల వారీగా నివేదిక తయారు చేయఆలని.. వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను మణి హారంలా తీర్చిదిద్దాల నీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## విద్యుత్ షాక్ తో కాలిపోయిన ఇళ్లను పరిశీలించి, కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వవిప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో మూడు బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ సభ్యుడు బీర్ల ఐలయ్య వ రామర్శించారు. మందనపల్లి గ్రామంలో రెండు ఇల్లు విద్యుత్ షాక్ తో దగ్ధం కావడంతో బాధితులైన జువ్వగాని పారిజాత భాస్కర్ గౌడ్,కోటగిరి పుష్పమ్మ కుటుంబాలను,అదే గ్రామంలోని మావూరం కృష్ణ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా వారి కుటుంబాలను పరామర్శించారు.కాలిపోయిన ఇళ్లను పరిశీలించి ఆర్థిక సహాయం అందజేశారు.ప్రభుత్వం నుండి కూడా సహాయం అందిస్తామన్నారు.

## బాహుపేట గ్రామంలో వాటర్ ప్లాంట్,సిసి కెమెరాలు ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య







**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం బహుపేట గ్రామంలో సీసీ కెమెరాలు,వాటర్ ప్లాంట్ ను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదివారం రోజు ప్రారంభించారు.ఈ సందర్భంగా నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రజలకు మంచినీరు అందించాలనే ఉద్దేశంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, డీసీపీ రాజేష్ చంద్ర,ఏసీపీ,సిఐ లు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రునికి ఆర్థిక సాయం

**-2001 - 2002 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల అందచేత**



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 2001- 2002 వ సంవత్సరం పదో తరగతి చదివినటువంటి పెద్ద పడిశాల గ్రామానికి చెందిన రావుల మధుసూదన్ తండ్రి రావుల యాదగిరి అకాల మరణానికి చింతిస్తూ 2001- 2002 పదో తరగతి మిత్రులు తమ తోటి మిత్రునికి ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో (టీజేయూ) తెలంగాణ జర్నలిస్టు యూనియన్ అడ్డగూడూర్ మండల అధ్యక్షుడు చింత సుధాకర్, అంబటి, వేణు, అంబటి సమ్మయ్య,సుక్క సోమయ్య, ఆకుల మహేందర్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ పంట ను పరిశీలించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు లోని తన వ్యవసాయ క్షేత్రాన్ని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు సందర్శించారు.తన వ్యవసాయ భూమిలో పామాయిల్ సాగు చేస్తున్నారు. ఇటీవలే మొక్కలు నాటడం తో వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చుట్టూ తిరిగి పరిశీలించారు.పంటకు వాడాల్సిన ఎరువులు,పురుగు మందుల తో పాటు పంటకు చేపట్టాల్సిన సస్యరక్షణ పై కూలీలకు సూచనలు చేశారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి

**-అమరవీరుల స్థూపానికి వినతి పత్రం ఇచ్చిన తెలంగాణ ఉద్యమకారులు**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** అసెంబ్లీ సమావేశంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని అమరవీరుల స్థూపానికి వినతి పత్రం ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,ఖమ్మం మంత్రులు పొంగులేటి ,తుమ్మల కు తెలంగాణ ఉద్యమకారులు విన్నవించారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సంధర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరచిన విధంగా ప్రకటించిన ఆరు గ్యారింటీలలో ఐదు గ్యారింటీల మిద స్పష్టమైన ప్రకటన చేశారు కానీ ఉద్యమకారులకు మీరు ఇచ్చిన హామీలు ముఖ్యంగా 250 చదరపు గజాలు మరియు ఇంటి నిర్మాణం కోరకు 10,00,000రూపాయలు హామీలు వచ్చే డిసెంబర్ 9 సోనియా గాంధి పుట్టిన రోజు నాటికి పూర్తిస్థాయి అమలలో తెస్తారని ఆశాభవం వ్యక్తం చేశారు. అదేవిదంగా ఉద్యమకారులకు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఉద్యమకారులు కోరారు . తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల కష్ట ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు .గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకున్న దాఖలాలు లేవు .ప్రభుత్వ పెద్దలే పరోక్షంగా అనేక అవమానలకు గురిచేసింది .కానీ అసెంబ్లీ ఎన్నికలు సంధర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోచూసి మాకు మా జీవితాల మీద ఆశలు చిగురించాయి అని అన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం లో అయినా ఉద్యమకారులకు గుర్తింపు వస్తుందనే నమ్మకం కలిగిందన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి కృష్ణారావు , ఉద్యమకారులు బొమ్మెర రాంమూర్తి,పగడాల నరేందర్,లింగబోయిన సతీష్ , బచ్చల పద్మచారి,పెళ్లూరి విజయ్ కుమార్,బోడా వీరన్న , భూక్యా రాంబాబు నాయక్ , భూక్యా శ్రీనివాస్ నాయక్, ఎస్డి బురాన్,ఎస్.కె అబ్బాస్ అలి , ఎండీ.ఆసీఫ్ అలి,అవుల నాగేశ్వస్వరావు, చెరుకు పల్లి నాగేశ్వరరావు,పొనుకోల కోటేశ్ యాదవ్, ఎండీ.వసిం ఖాన్ , బాలిన భాస్కర్ రెడ్డి,వీరబాబు, మహిళా ఉద్యమ కారుణిల జిల్లా అధ్యక్షురాలు రెడ్డిబోయిన వరాలక్ష్మి ,అనంత లక్ష్మీ,నల్ల స్వరూప రాణి,యలమూరి ధన లక్ష్మి ,ఝూనా విక్టోరియా,పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని శ్రీనివాస్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున నీలిమ హాస్పిటల్ హైదరాబాద్ వారీ సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంప్ 19వ వార్డులో నిర్వహించారు.ఈ ఉచిత వైద్య శిభిరం డాక్టర్స్ పాల్గొని వార్డు ప్రజలకు షుగర్, బిపి థైరాయిడ్ వ్యాధులకు ఇతర వ్యాధులకు సంబందించిన పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్ కుమార్, వార్డు కౌన్సిలర్ వడిచెర్ల లక్ష్మి కృష్ణ, శ్రీనివాస్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎం డి తాడూరి నరోత్తమ్,మాజీ కౌన్సిలర్ తాడురి బిక్షపతి, తాడురి నరసింహ, తాడురి కిష్టయ్య, తాడూరి చంద్రయ్య, తాడూరి మల్లేష్, చిన్నగారి బాల నరసింహ, చిన్నగారి బలరాం, రమేష్, దాసరి కుమార్, నరాల శంకర్, నరాల పాండు, ఎంకే శ్రీధర్, బాల్ శంకర్, క్రిష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు వినతి పత్రం



**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**

అసెంబ్లీసమావేశంలో తెలంగాణఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర కమిటీ అధ్యక్షులు డాక్టర్ సీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వలిగొండ మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు వినతి ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు మారగోని శ్రీనివాస గౌడ్ అధ్యక్షత వహించాగా ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించాలని ఈ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం పెట్టాలని మీరు ఇచ్చిన హామీ 250 గజాల ఇంటి స్థలంతోపాటు 25 వేల రూపాయల పెన్షన్ మిగతా రాయితీలు కల్పించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల నాయకులు శీలం స్వామి రాష్ట్ర మహిళా బాకారం లావణ్య.జోగు అంజయ్య మల్లం వెంకటేశం గంధ మల్ల,మల్లమ్మ,ఐటి పాములపుష్ప,సిరిపంగి గణేష్,ఈతపమల్లేశం,నందనం శీను,పబ్బు స్వామి,తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూర్ ఎం మండల కేంద్రంలో నిరుపయోగంగా బస్టాండ్

**-ప్రహరీగోడను నిర్మించారు కానీ ఉపయోగంలోకి తీసుకురాలేదు**

**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని ప్రయాణికుల సౌకర్యార్థం 20 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ కొద్దిరోజులు ఉపయోగములో ఉన్నాను ఆ తర్వాత ఉపయోగములో లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. పేరుకు మాత్రమే అధికారులు బస్టాండ్ నిర్మించారు కానీ ఆ ప్రాంతంలో బస్సులు నిలిపేందుకు ఎలాంటి చర్యలు తీసుకొన లేదని ప్రయాణికులు అధికారుల పనితీరుపై మండిపడుతున్నారు. 20 ఏళ్ల క్రితమే నిర్మించిన ఈ బస్టాండ్ లో బస్సులు నిలిపేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్టాండ్ ప్రస్తుతం ప్రైవేట్ వాహనాలకు మందు బాబులకు కుక్కలకు ఆవాసంగా మారింది.వాడుకలో లేకుండా ఉండటంతో వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ శిథిలావస్థకు చేరుకుంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రంలో ప్రస్తుతం బస్సులను నిలుపుతున్న స్థానంలో బస్సు షెల్టర్ ఉపయోగంలో లేకుండా పోవడంతో ప్రయాణికులు వర్షానికి తడుస్తూ ఎండకు ఎండుతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వివిధ పనుల నిమిత్తం గ్రామస్తులు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యార్థులు పాఠశాలలకు కళాశాలలకు వెళ్లిరావడానికి రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ లో బస్సులు నిలపకపోవడంతో నానా తంటాలు పడాల్సి వస్తుంది అని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని 23 గ్రామాలకు చెందిన ప్రజలు మరియు ఇతర మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని బస్టాండ్ నిరుపయోగ ఉండటంతో తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులు ప్రజలకు సమస్యలు వచ్చినప్పుడు కనిపించడం లేదని పలువురు





ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్సు స్టాండ్ ను పునరుద్ధరించి వాడకలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. ఈ మధ్య కాలంలో చుట్టు ప్రహరీగోడను నిర్మించారు అయినప్పటికీ ఉపయోగంలోకి తీసురాలేకపోవటం విచారించవలసిన విషయం. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే స్పందించి బస్టాండును ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



కౌకుంట్ల మధుసూదన్ రెడ్డి తిమ్మాపురం

వాడుకలోకి తీసుకురావాలి కౌకుంట్ల మధుసూదన్ రెడ్డి.ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండును వాడుకలోకి తీసుకురావాలని వాడుకలో లేకపోవడంతో మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని కోరుకుంటున్నాను.



కానుగంటి శ్రీశైలం నాచారిపేట

బస్టాండును పునరుద్ధరించాలి కానుగంటి శ్రీశైలం. ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలో ఉపయోగంలో లేని బస్టాండును పునరుద్ధరించి ఉపయోగంలోకి తీసుకునిరావాలి. మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ ఉపయోగంలో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం ప్రతినిత్యం వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు వస్తుంటారు వెళ్తుంటారు. అందువలన బస్టాండును పునప్రారంభించాలని అన్నారు.

# ఘనంగా పైళ్లఅశోక్ రెడ్డి పదవి విరమణ వీడ్కోలు



**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని టేకులసోమరం గ్రామనికి చెందిన ప్రకృతిప్రేమికుడు , ఇంచార్జిప్రధానోపాధ్యాయుడు,పైళ్ల అశోక్ రెడ్డి పదవి విరమణ వీడ్కోలు ఆదివారం బోడుప్పల్ పరిధి యన్ ఐ యన్ కాలిని అమర నిలయంలో ఘనంగా నిర్వహించారు మోటకొండూరు మండలంలోని చాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఇరువై ఎనిమిది సంవత్సరాలుగా వృత్తిధర్మంలో కొనసాగి గతనెల జూన్ ముప్పై తేదిన పదివి విరమణ పొందిన సందర్భముగా చేయూత ఫౌండేషన్ చెర్మన్ అభినవ కవి పుడమి రత్న అవార్డు గ్రహీత వాకిటి రామ్ రెడ్డి పాల్గొని పుణ్య దంపతులైన పైళ్ల అమర,అశోక్ రెడ్డి కు శాలువతోసత్కరించి,మెమెంటో అందించి ఘనంగా పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భముగా వాకిటి రామ్ రెడ్డి మాట్లడుతూ విధినిర్వహణలో ఒక్కరొజు కూడ సెలవు పెట్టకుండా పాఠశాలకు వెళ్తూ,విద్యార్థుల క్రమశిక్షణలో తనదైనా ముద్రవేస్తూ,విద్యాధాధికారులతోఎన్నో, ప్రశసంలుఅందుకొని, చదువును మించిన సంపదలేదని నిత్యవిద్యార్థిగా కొత్తవిషయాలు తెలుసుకొని ఎందరికొ స్పూర్తినిస్తూ,ఖాళీసమయంలో బిల్డింగు పైన వివిధ రకాలైన ఔషధ మొక్కలు,కూరగాయలకు సంబందించిన మొక్కలను సేంద్రియ పద్దతితో పెంచుతు ఇంటిపరిసరాలలో నిరుపయెగముగా ఉన్న చెత్త చెదారం,టి వడబోసిన రా పదార్థములను సేకరించి ఒక డబ్బాలో వేసి,వర్మీ కంపోస్టుగా తయారుచేసి మొక్కలకు ఎరువుగా ఉపయోగిస్తు,ప్రకృతి ప్రేమికుడిగా నిలిచారని కొనియాడరు వారి శేషజీవితం సమాజసేవలొ ఆనందముగా గడుపుతూ నిండు నూరేళ్ళవర్ధిల్లాలనికోరారు.ఈ కార్యక్రమములో సహచర,ఉపాధ్యాయిని, ఉపాద్యాయులుకవిత సుధారాణి రాదిక రవిచందర్, రమేశ్, శ్రీనివాస్,కిషణ్ కుటుంబసబ్యులు నవీన్,ప్రవీణ్,పాల్గొని పదవివిరమణ వీడ్కోలుతెలిపారు.

# అధికార పార్టీ లో బీసీ లకు న్యాయం చేయాలి



**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి**
మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ పక్కన బీసీ భవన్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఏళ్ల తరబడి జెండా మోసి. పార్టీ నీ అధికారం లోకి తీసుకువచ్చిన బీసీ లకు నామినేటెడ్ పదవులు ఇచ్చి న్యాయం చేయాలని మిర్యాలగూడ బీసీ జెఎసి విజ్ఞప్తి చేసింది. బీసీ జేఏసీ నాయకులు మారం శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంటు సైదులు, రాపోల్ పరమేష్, బీసీ సీనియర్ నాయకులు పుప్పాల సత్యం, కోల సైదులు మాట్లాడుతూ మిర్యాలగూడ అధికార పార్టీ లో సీనియర్ నాయకుడు చిరుమర్రి కృష్ణయ్య ఓకే పార్టీ లో 50 సంవత్సరాలుగా తన సేవలందిస్తున్నారనీ అన్నారు.. ఏ ప్రభుత్వం వచ్చినా కూడా ఇతర పార్టీ వైపు చూడకుండా, తన పార్టీని తన తల్లి లాగా భావించి ఆయా పార్టీలు పదవులు ఇస్తా అని ఆశ చూపిన పార్టీలు మారకుండా తనకి ఏ పదవులు రాకపోయినా పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రభుత్వం రావటానికి అహర్నిశలు కృషి చేసిన అధికార పార్టీ బీసీ నాయకుడు చిరుమర్రి కృష్ణయ్య సేవలను విస్మరించ వద్దని బీసీ కుల సంఘాలు, బిసి ఉద్యోగ సంఘాలు అభిమానులు కోరుతున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో నామినేట్ పోస్ట్ ఇవ్వాలని కోరారు... ప్రభుత్వం 50% బీసీలకు నామినేట్ పోస్టులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఏ పార్టీ అధికారం లోకి వచ్చినా బీసీ లకు పదవులు ఇవ్వడం లో వివక్ష చూపుతుందని అన్నారు. బీసీలను జెండాలు మోసే కూలీ లుగానే పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా ఎంతో అనుభవం ఉన్న బీసీలు ఉన్నాగా బీసీలకు సరైన ప్రాధాన్యత లేకపోవడం వలన బీసీ కుల సంఘాలకు, బిసి ఉద్యోగులకు ప్రాధాన్యత ఉండకపోవటం.. బీసీ నిరుపేదలకు సంక్షేమ పథకాలు సబ్సిడీ లోన్ లు అందకపోవటం వలన బీసీలు ఎంత ఇబ్బంది పడుతున్నారొ తెలియని విషయం కాదు. రాష్ట్ర జనాభా లో యాభై శాతం పైగా ఉన్న బీసీ లు పార్టీని అధికారం లోకి తీసుకువచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ బీసీ జనగణన జరిపి రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీ మేరకు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచిన తరవాతే ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు సరైన న్యాయం జరుగుతుందని పత్రికా ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు చల్లా సోమలింగంయాదవ్, తోట వెంకటేశ్వర్లు, దాసరాజు జయ రాజు,అమృతం రవీంద్ర, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు

# పాలేరు నియోజకవర్గ నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి కానుక

**-గ్రూప్ 2,3, ఎస్.ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ**
**-రైట్ ఛాయిస్ అకాడమీ కిరణ్ ఆధ్వర్యంలో కోచింగ్ క్యాంప్**

**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :**
కూసుమంచి : పాలేరు నియోజకవర్గంలో పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న గ్రామీణ నిరుద్యోగులకు తెలంగాణ రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేయూతను అందించేందుకు ముందుకు వచ్చారు. రాష్ట్రంలో పోటీపరీక్షలకు అత్యున్నత శిక్షణా సంస్థ రైట్ ఛాయిస్ అకాడమీ సహకారంతో త్వరలో జరగనున్న గ్రూప్2,3 పరీక్షలతో పాటు రాబోయే పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి పొంగులేటి శీనన్న నిరుద్యోగ కానుక పేరిట ఉచిత కోచింగ్ క్యాంప్ ను ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మంత్రి విడుదల చేశారు. పాలేరు నియోజకవర్గంలోని నిరుద్యోగులంతా.. ఈ శిక్షణా శిబిరాన్ని ఉపయోగించుకొని తమ కలల ఉద్యోగాన్ని సాధించేందుకు కృషిచేయాలని పొంగులేటి ఆకాంక్షించారు. గతంలో కూడా తాను ఎంపీగా ఉన్న సమయంలో రైట్ ఛాయిస్ అకాడమీ కిరణ్



సహకారంతో ఏర్పాటు చేసిన కోచింగ్ క్యాంప్ లో వందలాదిమంది ఉద్యోగాలు సాధించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. రైట్ ఛాయిస్ అకాడమీ చైర్మన్ మెండెం కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీల సహకారంతో పోటీ పరీక్షల శిక్షణతో పాటు, మాక్ టెస్టులు, ఉచిత స్టడీ మెటీరియల్ ను ఈ శిక్షణా శిబిరంలో అందించనున్నట్లు తెలిపారు. పాలేరు నియోజవకర్గంలో పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న వారంతా.. ఆగస్ట్ 9లోపు అభ్యర్థి పేరు, గ్రామం, మండలం వివరాలను 8985096699 ఫోన్ నెంబర్ కు వాట్సప్ లో పంపాలని మెండెం కిరణ్ కోరారు. వేలకు వేలు ఫీజులు కట్టి కోచింగ్ తీసుకోలేని గ్రామీణ విద్యార్థుల కోసం మంత్రి పొంగులేటి ఉచిత శిక్షణా శిబిరం ఏర్పాటు చేయడం పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలోనే. నిరుద్యోగుల కోసం ఉచిత కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్న మొదటి ప్రజాప్రతినిధి పొంగులేటి శీనన్న కావడం విశేషం.

# బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

**తరంగాలు ప్రతినిధి/రాయపర్తి:**
రాయపర్తి మండల కేంద్రానికి చెందిన మండల పార్టీ యూత్ నాయకులు చందు సతీష్ తాత, మండల పార్టీ నాయకులు చందు మల్లేష్ తండ్రి తెలంగాణ ఉద్యమకారుడు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు చందు కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం వారి దశ దిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి,బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అదేవిధంగా రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ఎండీ మన్సుర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారి ఇంటికి వెళ్లి





కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ ఎన్నికల ఇంచార్జి గుడిపూడి గోపాల్ రావు,మండల పార్టీ నాయకులు,స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం





**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల మధిర గోలిగూడెంలోను నూతన వాటర్ ఫిల్టర్ ను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదివారంప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల త్రాగునీటి కొరతను తీర్చడానికి దివిస్ కంపెనీ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ఫిల్టర్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు అంతేకాకుండా గ్రామ ప్రజల ప్రధాన సమస్యలైనా రోడ్డు సౌకర్యం పై ఆయన స్పందిస్తూ అతి తొందర్లోనే నూతన రోడ్డును సుంకిశాల నుండి కాటేపల్లి వరకు నిర్మాణం చేపడతామని ఆయన అన్నారు అలాగే బునాది గాని కాలువ నీరును రైతులకు అందించే ప్రక్రియ చేపడుతామని కూడా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పులిగిల్ల గ్రామ శాఖ అధ్యక్షులు బుగ్గ వెంకటేశం, గోలిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు కంచి రాములు ఉపాధ్యక్షులు పాల సంఘం చైర్మన్ పర్వతం సత్తయ్య, పాశం స్వామి, దయ్యాల శ్రీశైలం,జక్కిడి చంద్రారెడ్డి,కాసర్ల నరసింహారెడ్డి,వెంకట్ రెడ్డి,కొంతం తిరుమల్ రెడ్డి,పర్వతం రాజు, భోగ రమేష్,బుగ్గ మల్లయ్య,ఎడ్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భాజపా మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం





**-ముఖ్యఅతిథిగా భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్**

**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఆదివారం సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్,అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ పాల్గొనడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం గురించి మండలంలోని సమస్యల గురించి తీర్మానాలను చేయడం జరిగింది. ఇట్టి తీర్మానాలను సమావేశానికి విచ్చేసిన కార్యకర్తలు నాయకులు ఆమోదం తెలపడం జరిగింది. రానున్న రోజుల్లో గ్రామ గ్రామాన పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు అహర్నిశలు తమవంతు బాధ్యతగా కష్టపడాలని సమావేశానికి హాజరైన నాయకులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బిజెపి పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.ఎన్. రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏలే చంద్రశేఖర్,బిజెపి జిల్లా కార్యదర్శులు కొప్పుల యాది రెడ్డి,వేముల నరేష్,అసెంబ్లీ కో కన్వీనర్ రాచకొండ కృష్ణ,కిసాన్ మోర్చాజిల్లా కార్యదర్శి కందుల తానేష్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మందుల లక్ష్మీ,యువ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ బుంగమట్ల మహేష్, యువమోర్చా జిల్లా కార్యదర్శి రేగూరి అమరేందర్,పార్టీ సీనియర్ నాయకులు దంతూరి సత్తయ్య, సీలోజు శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చు శ్రీనివాస్,బొడిగె ఆనంద్,పాక పుల్లయ్య మాజీ మండల అధ్యక్షుడు నాగేల్లి సుధాకర్,అశోక్ రెడ్డి, మైసొల రామ నర్సు, మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి,మండల ఉపాధ్యక్షులు గంగాధారి దయాకర్, వట్టిపల్లి సంతోష్, దయ్యాల వెంకటేశం, రుద్రవెల్లి మచ్చగిరి, రావుల పద్మా రెడ్డి నక్క సందీప్ రెడ్డి మండల కార్యదర్శిలు మందుల నాగరాజు,బైరు మల్లేశం,మైసొల్ల మచ్చ గిరి,గంగాపురం నరేష్, ఎదురుగట్ల వెంకటేశం, పార్టీ కోశాధికారి అప్పిశెట్టి సంతోష్ మాజీ ఉపసర్పంచ్ మైసొల్ల మచ్చగిరి, యువ మోర్చా మండలాధ్యక్షుడు రంజిత్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి శివకుమార్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కొత్త రామచందర్ యాదవ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పల్లెర్ల నరసింహ,ఓబిసి మోర్చామండలాధ్యక్షుడు ఎలిమినేటి వెంకటేశం, పాతకోట నరేష, మహిళా మోర్చా మండల అధ్యక్షులు చిన్న అంజమ్మ, ప్రధాన కార్యదర్శి భాగ్యమ్మ, మంద నరసింహ, మైసొల్ల రామ నర్సు, ఓబీసీ మోర్చా,కిసాన్ మోర్చా,వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**-పోల గాని వెంకటేష్ గౌడ్**

**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి**

నల్లగొండ నియోజక వర్గంలో పానగల్లు పచ్చల సోమేశ్వరి దేవాలయంలో స్టార్ క్యాంపియన్ చైర్మన్ పోల గాని వెంకటేష్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు పూజలు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేసి నారు తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని మంచిగా వర్షాలు కురవాలని పంటలు బాగా పండాలని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరినారు వారిని నల్లగొండ నకిరేకల్ చిట్యాల కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున సన్మానించడం జరిగినది వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ హరీష్ రావు వాక్యాలు ఖండించిన వెంకటేష్ గౌడ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై హాఫ్ నాలెడ్జి అంటూ మాజీ మంత్రి హరీష్ రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అగ్గిపెట్టె దొరకని మాజీ ఆర్థిక మంత్రి హరీష్ రావు తను చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం మంత్రి పదవిని తృణపాయంగా వదిలేసి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరణ నిరాహార దీక్ష చేసిన ప్రియతమ నాయకులు తెలంగాణ రాష్ట్ర గుండెచప్పుడు





రాష్ట్ర రోడ్లు భవనాల మరియు సినిమా ట్ గ్రఫీ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలిదశ ఉద్యమంలో త్యాగం చేసి తెలంగాణ రాష్ట్రం వచ్చేదాకా మంత్రి పదవిని స్వీకరించానని శపథం చేసిన ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అయితే మళ్లీ దశ ఉద్యమంలో మంత్రి పదవిని త్రపాయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరనా నిహార దీక్ష చేసి తెలంగాణ రాష్ట్రం వచ్చాకే మళ్లీ మంత్రి పదవిని స్వీకరించిన గొప్ప నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి అలాంటి మంచి వ్యక్తి పై హరీష్ రావు వ్యాఖ్యలు ఖండిస్తున్నాను రానున్న రోజుల్లో స్థానిక సంస్థలలో జిల్లా మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు జిల్లా అధ్యక్షుని ఆశీస్సులతోటి జిల్లావ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేసి జడ్పిటిసి ఎంపీపీలు సర్పంచులు కౌన్సిలర్లు మొత్తం కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలను కైవసం చేసుకునే విధంగా సుడిగాలి పర్యటన చేస్తానని కోరుచున్నాను ఈ కార్యక్రమంలో మాజీ ఓబిసి జిల్లా చైర్మన్ వనమాల రమేష్ నేత చాపల యాదగిరి గంగాపురం గణేషు చాపల సురేష్ మే తేరా బాబు మున్నా గోకరకొండ రాంబాబు దాసు సతీష్ దశరథ లతీఫ్ శ్రీకాంత్ నాగార్జున పాల్గొన్నారు

## తల్లి దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

**-రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి**



**తరంగాలు ప్రతినిధి/వరంగల్:**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 63వ డివిజన్ మహంకాళి బోనాలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఆ మహంకాళి తల్లి దీవెనలతో సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతులు, విద్యార్థులు,యువకులు సంతోషంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేశారు.

## క్రిస్టియన్ స్మశాన వాటికను పరిశీలించిన మైనారిటీ చైర్మన్ దీపక్ జాన్



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో**

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం,మహేశ్వరం లోని క్రిస్టియన్ శ్మశాన వాటికలను క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ దీపక్ జాన్ అధికారులతో కలిసి పరిశీలించారు. తెలంగాణలో క్రైస్తవ సమాజాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తో సమీక్ష నిర్వహించి క్రైస్తవుల సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని దీపక్ జాన్ అన్నారు.

## చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ ఆధ్వర్యంలో ఆగస్టు 6 ,7 తేదీల్లో పలు బీసీ డిమాండ్ల సాధన కోసమై చేపట్టిన హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దేవరకొండ నరేష్ చారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసం సురేష్, రాష్ట్ర నాయకుడు వాసం సాంబయ్య, సంజు కుమార్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు కుళ్ళ సతీష్,ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు సంపత్ యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షులు ఆవునూరి సతీష్ మహిళా నాయకులు చిత్తారి రజిత, శ్రీలత, సాగరిక, ఆలేరు మండల్ బహదూర్ పెట్ గ్రామ ఎక్స్ సర్పంచ్ కూళ్ల నరసింహులు,రాష్ట్ర యూత్ ఇన్చార్జి నాగరాజు చారి,శివ కిరణ్,రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ



సందర్భంగా నాయిని భరత్ మాట్లాడుతూ ఆగస్టు 6 ,7 తేదీలలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దీక్ష విజయవంతం చేయండి. కొందరు దొంగ బీసీ నాయకుల వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేయాలి. ఐదు ప్రధాన డిమాండ్లతో ఢిల్లీలో దీక్ష చేయబోతున్నాం. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. బీసీ విద్యార్థులకు 100% ఫీజు రియంబర్స్మెంట్ అందజేయాలి. చట్ట సభల్లో బీసీల వాటా సాధన కోసం జాతీయస్థాయి ఓబీసీ సప్తె సాధన. మా డిమాండ్లను పరిష్కరించని ఎడల ఆందోళనలు చేపడతాం అని అన్నారు.

తరంగాలు Tharangalu Daily News Paper RNI. TELTEL / 2022 / 83463

# మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని సన్మానించిన





**– టి యూ డబ్ల్యూ జె ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ జర్నలిస్టు కమిటీ**

**తరంగాలు,/వరంగల్ జిల్లా బ్యూరో :**
తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటిసారిగా వరంగల్ పర్యటనకు వచ్చిన శ్రీనివాస్ రెడ్డి ని (టియు డబ్ల్యూ జే ఎఫ్) ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు మమ్మద్ సాజిద్ పాష ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు హనుమకొండ ప్రెస్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. అన్ని జర్నలిస్టుల యూనియన్లలు చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న జర్నలిస్టుల సమస్యలు ఇండ్లు, హెల్త్ కార్డు, అక్రిడేషన్ వంటి పలు సమస్యలను ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతంగా పూర్తి అయ్యేటట్టు చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టి యూ డబ్ల్యూ జె ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల అధ్యక్షులు మహమ్మద్ సాజిద్ పాషా, కార్యదర్శి ఎంఏ నయీం, సలహాదారులు ఇస్మాల్ జాబి, ఉపాధ్యక్షులు ఎండి అక్రం, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు ఎండి నయీంపాష, ఎండి మొయిన్, ఖాదర్,ఎండి బాబార్, రియాజుద్దీన్, ఎండి బషీర్, ముబాషీర్,అమీర్,మాజిద్, మొమిన్,ఫిరోజ్ బాబా, సిరాజ్ ,సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శివశక్తి మహంకాళి బోనాలు

**–అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, బోనం సమర్పించిన**
**–ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**తరంగాలు ప్రతినిధి/హన్మకొండ:**
ఖాజిపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలో ఆదివారం శివశక్తి మహంకాళి బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ బోనాల ఉత్సవానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, బోనం సమర్పించారు. ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే బోనాల జాతరలో భాగస్వామ్యం అవడం చాలా సంతోషకరమని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా, బాషా పరిణితి పరిణమిల్లె విధంగా జాతర వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయశ్రీ రజాలి, మాజీ కార్పొరేటర్ గుంటీ కుమారస్వామి, సీనియర్ నాయకులు సయ్యద్ రజాలి, మొహమ్మద్ అంకుష్, నాయకులు క్రాంతి భరత్, షేక్ అజ్గర్, జక్కుల నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**తరంగాలు /సంగెం**
మండలంలోని లోహిత జెడ్పిపిఎస్ఎస్ హైస్కూల్ లో 1989–90 పదవ తరగతికి చదివిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు కలసి బాగా సందడి చేస్తూ ఆత్మీయ సమ్మే ళనం నిర్వహించుకున్నారు. ఆదివారం ఉదయం పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. సరిగ్గా 34 సంవత్సరాల తరువాత వారంతా ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ చాలా సంతోషంగా గడిపారు. నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు,యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో చిలిపి చేష్టలు మరువలేనివని, ఆనాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులుకు శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి యొక్క ఆశీస్సులు తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు రాంమూర్తి, ఉపాధ్యాయులు కుమారస్వామి, విరస్వామీ,బిక్షపతి, నర్సయ్య, దయమని, పుల్లారెడ్డి, రవీందర్, సుమారు 40 మంది పూర్వ విద్యార్థులందరూ కలసి ఒకేచోటచేరి డాన్సులు చేస్తూ సందడిగ సాయంత్రం వరకు గడిపారు. ఒక్కరినొకరు ఆప్యాయతగా పలకరించుకొని ఫోన్ నంబర్లు తీసుకొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

# ఆగస్టు చివరికల్ల అందుబాటులోకి నాయిమ్ నగర్ బ్రిడ్జి





**–పనులు వేగవంతంగా జరుగుతున్నాయి**
**–నాణ్యత పరమైన ప్రమాణాల్లో ఎటువంటి లోటుపాటు లేకుండా పనులు జరగాలి**
**–ప్రజల ఇబ్బందికి మరికొద్ది రోజుల్లో స్వస్తి**
**–బ్రిడ్జి నిర్మాణం ద్వారా నగర వాసులకు చాలా సమస్యలు తీరానున్నాయి**
**– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.**

**తరంగాలు ప్రతినిధి/హనుమకొండ:**
దశబ్దాల కలగాఉన్న నయీమ్ నగర్ బ్రిడ్జి (పెద్ద మోరి ) పనులు చివరి దశకు చేరుకున్నాయని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. రెండవ దశ పనులు పూర్తి కావచ్చాయని ఆగస్టు చివరికల్లా రవాణాకు సిద్ధంగా బ్రిడ్జి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికి రెండవ దశ బ్రిడ్జి పనులు కూడా పూర్తి కావచ్చాయని చివరి దశ బ్రిడ్జి పనులు పూర్థయినా క్రమంలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. బ్రిడ్జ్ నిర్మాణ పనుల్లో నాణ్యత పరమైన ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. చిరకాల కోరికగా ఉన్న పెద్దమోరి నిర్మాణం ద్వారా ప్రధాన రహదారికి మరియు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కలుగుతున్నాయని ఎమ్మెల్యే ఆశభావం వ్యక్తం చేశారు. తెలీకపాటి వర్షాలకు సైతం కూరుకుతున్న పెద్ద మోరి వలన ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో కోతలకు గురైన ప్రదేశాలను, అక్రమ నిర్మాణాలను కూల్చి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే వర్షాకాలం నాటికి ఎంతటి వర్షభావ పరిస్థితి ఉన్నాకూడా ప్రజా రావాణకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు.



# మహిళా శక్తితో ఆర్థికంగా ఎదగాలి





**–సెర్ప్– డిఆర్డిఏ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య**

**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:**
మహిళలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకాన్ని వినియోగించుకొని వ్యాపార వాణిజ్య రంగాల్లో మరింత ఎదగాలని డిఆర్డిఏ–సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య సూచించారు. ఆదివారం మండలంలోని ఇల్లందలో గంగ,తుంగభద్ర గ్రామైక్య సంఘాల వార్షిక మహా సభ పద్మశాలి భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో కొమురయ్య పాల్గొని మాట్లాడారు. వివో ప్రతినిధులు వార్షిక నివేదికలోని ఆదాయ వ్యయాలు,ఆస్తి బాధ్యతలను చదివి వినిపించారు. ఇప్పటివరకు వార్షిక ఆదాయము రూ. 7,93,539.37 రాగా, 2024–25 సంవత్సరానికి వార్షిక ప్రణాళికను రూపొందించగా సభ్యులందరూ ఆమోదించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ... వివో ల ద్వారా ప్రభుత్వ అందించే సేవలను మహిళలు సద్వినియోగం చేసుకొని మహిళా సాధికార దిశగా ప్రయాణించాలని ఉద్బోధించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు ఎడ్ల అరుణ ఎస్విఈపి సిఆర్పి మహబూబా, బొంతల మౌనిక, ప్రతినిధులు మోడం కవిత, స్వప్న ,ఎల్లమ్మ, సుమలత, నీరజ ,ఆకుల, కత్తి స్రవంతి లు ,మహిళా సంఘాల ప్రతినిధులు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# బోనమెత్తిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**–నల్లపోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు**



**తరంగాలు/హైదారాబాద్:**
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర హైదరాబాద్ పాతబస్తీలోని లాల్ ధర్వాజ నల్లపోచమ్మ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లాల్ ధర్వాజ మేకలబండలో కొలువైన శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ బోనాల జాతర సందర్భంగా ఆదివారం ఆయన అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రకు బోనాల జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు పొన్న వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి గోల్కొండ నవీన్,మున్నూరుకాపు ప్రముఖులు తూడి ప్రవీణ్,మీసాల చంద్రయ్యలు ఘన స్వాగతం పలికారు. ఎంపీ వద్దిరాజు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించి, పూలమాల,శాలువాతో సత్కరించి అమ్మ వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు వెంట గాయత్రి గ్రానైట్స్ కంపెనీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# అద్దెకు ఆర్టీసీ బస్సులు

**– మహబూబాబాద్ డిపో మేనేజర్ ఎం శివప్రసాద్..**



**తరంగాలు/మహబూబాబాద్ :** టి.జి.ఎస్.ఆర్.టి.సి.మహబూబాబాద్ డిపో వారు గొప్ప శుభవార్త చెప్పారు.ఇకనుంచి మహబూబాబాద్ డిపో నుండి పెళ్లిళ్లకు,శుభకార్యాలకు, విహారయాత్రలకు ఆర్డిసి బస్సులు అద్దెకు ఇవ్వబడునని తెలిపారు.ఆగస్టు నెలలో పెళ్లి ముహూర్తాలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇచ్చేందుకు మహబూబాబాద్ డిపో సిద్ధంగా ఉందని డిపో మేనేజర్ ఎం శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేషారు.ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ సౌకర్యంతంగా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులను అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని మహబూబాబాద్ పరిసర ప్రజలు, ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.పూర్తి వివరాలకోసం ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

9948214022:
9989009327.

# శ్రీలక్ష్మి నరసింహస్వామి సన్నిధిలో మాజీ ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్ సజ్జనార్



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** తెలంగాణ రాష్ట్రంలోని యాదగిరిగుట్ట ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మి నరసింహస్వామిని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండి, మాజీ పోలీస్ ఎన్ కౌంటర్ స్పెష లిస్ట్ సజ్జనార్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపము వద్ద వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. కార్యనిర్వహణాధికారి ఏ భాస్కరరావు లక్ష్మి నర సింహ స్వామి వారి లడ్డు ప్రసాదం అందజేశారు.

# బాధిత కుటుంబానికి టిఆర్ఎస్ నాయకుల పరామర్శ



**తరంగాలు ప్రతినిధి/రాయపర్తి:** రాయపర్తి మండలం పెరికేడ్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మెర వీరాస్వామి తండ్రి బొమ్మెర బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి బక్కయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, స్థానిక తాజా మాజీ సర్పంచ్ చిన్నల రాజబాబు, మండల పార్టీ నాయకులు నాగపూరి సోమయ్య, భాషబోయిన సుధాకర్, ఆశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, ఉబ్బని సింహాద్రి, తదితరులు ఉన్నారు.

# ఎన్. హెచ్.ఎం. ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలి





**మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు జి. రాజు.**

**–రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా**



**మంచిర్యాల జిల్లా జాయింట్ సెక్రటరీగా వేల్పుల అప్సర**

**తరంగాలు ప్రతినిధి/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా సమావేశం సిపిఐ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తామని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. ఆదివారం నూతన మంచిర్యాల జిల్లా నూతన కమిటీ సమావేశం సిపిఐ కార్యాలయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీలో నూతనంగా ఎన్ హెచ్ ఎం 150 మంది చేరగా ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ప్రతి ఒక్కరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్లో దాదాపు 17 వేల మంది పనిచేస్తున్నారు అని తెలిపారు. వీరంతా వివిధ కేటగిరీల్లో పని చేస్తున్నారని, పని భారం ఎక్కువ వేతనం తక్కువ ఇవ్వడంతో సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేంతవరకు కలసికట్టుగా పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. వైద్యులను ఎలాంటి పరీక్ష లేకుండా డైరెక్టా రెగ్యులర్ చేశారని అదే రీతిలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులకు ఒక న్యాయం చిన్న ఉద్యోగులకు మరొక న్యాయమా అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, దేవన బోయిన బాపు యాదవ్ , కలందర్, మహేందర్ ,డాక్టర్ . జానపాటి శరత్ బాబు, దెవలప్, అప్సర, సందీప్, , సరితా, సంధ్య, రాణి , దేవా, మహేందర్, రాజు గౌడ్, కీర్తి కీర్తి , అంజలి ,సౌమ్య శ్రీమంజుల , తదితరాలు పాల్గొన్నారు.నూతన జిల్లా కమిటీ మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మేకల దాసు (ఏఐటియుసి), జిల్లా అధ్యక్షుడు జీ.రాజు, ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం మధు బాబు, వైస్ ప్రెసిడెంట్లు రాజ్ కుమార్ కే .ధనలక్ష్మి, కోశాధికారి ప్రవీణ్య, జాయింట్ సెక్రెటరీ జాడి కళావతి, జాయింట్ సెక్రెటరీ వేల్పుల అప్సర, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ శివ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు కీర్తి, సుమన్ , మురళి, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ గా ప్రవళిక తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలియజేశారు.



**మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దేవన బోయిన బాపు యాదవ్**

# ఖాకీ దుస్తుల్లో ఉన్న కరుణామూర్తులు





**-అంధుని జీవితానికి మహబూబాబాద్ పోలీసుల ఆసరా**

**-నిలువనీడలేని కుటుంబానికి ఇళ్ళు కట్టించి ఇచ్చిన మానవత్వం**

**-ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్, పోలీస్ అధికారులకు..చేతులు జోడించి మొక్కిన నిరుపేద కుటుంబం.**

**తరంగాలు/మహబూబాబాద్:** అంధునికి పోలీసులు ఆసరాగా నిలిచి పక్కా గృహాన్ని కాట్టించి ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ స్వయంగా వచ్చి ఇంటిని ప్రారంబించారు. దీంతో ఖాకీ దుస్తుల్లో ఉన్న కరుణామూర్తులంటూ జిల్లా వ్యాప్తంగా మహబూబాబాద్ పోలీసులను ప్రజలు అభినందనలతో ముంచెత్తుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే మహబూబాబాద్ జిల్లా నర్సింహులుపేట మండలం పెద్దనాగారంలో మందుల నాగన్న అనే అంధుడు తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. కంజర కొడుతూ..పాటలు పాడుతూ యాచకవృత్తితో నాగన్న జీవించేవారు. కంటిచూపు లేకపోవడంతో తల్లిదండ్రుల తోడుగా యాచిస్తూ జీవించేవాడు. పెద్దనాగారంలో నిలువనీడ కూడా లేకపోవడంతో ఓ..ప్లాస్టిక్ పట్టా కట్టుకొని ఎండకుఎండుతూ.. వానకు తడుస్తూ.. చలికి వణుకుతూ దయనీయంగా జీవించేవాడు. నర్సింహులుపేట ఎస్ఐ సతీష్ ద్వారా ఈ..విషయం తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లాఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ మానవత్వంతో స్పందించారు. నిలువనీడలేని ఆ..అంధుని కుటుంబానికి పోలీసులే ఆసరాగా మారాలనే ఆలోచనతో ముందుకు సాగారు.ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ మంచిమనసులో పుట్టిన ఆలోచన, ఆచరణలోకి వచ్చింది.ప్లాస్టిక్ కవర్ నీడలో బ్రతుకొక నరకంగా గడిపిన ఆ..కుటుంబానికి భరోసా లభించింది. కనీసం వారు కలలో కూడా ఊహించుకోనట్లుగా పక్కాగృహాన్ని పోలీస్ శాఖ స్వయంగా నిర్మించి బహుమతిగా ఇచ్చింది. మహబూబాబాద్ జిల్లాఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ స్వయంగా పెద్దనాగారం వచ్చి అంధుడు మందుల నాగన్న తో కలిసి ఇంటిని ప్రారంబించారు. కుచేలుని ఇంటికిద ఆ..శ్రీకృష్ణుడు కదిలివచ్చినట్టుగా..!! కంటి చూపులేని, నిలువనీడైనాలేని ఓ..కఠికదరిద్రుని ఇంటికి జిల్లాపోలీస్ బాస్ కదిలిరావడం.. కానుకగా ఏకంగా ఓ..ఇంటినే బహుమతిగా ఇవ్వడంతో ఆ..కుటుంబం ఆనందబాష్పాలతో తడిసి ముద్దయ్యింది. మహబూబాబాద్ జిల్లాఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ లోని మానవీయకోణాన్ని, ఎస్పీ దిశనిర్ధేశకత్వంలో జిల్లాపోలీస్ ల పనితీరును ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు.



తరంగాలు
జాతీయ దిన పత్రిక
Tharangalu Daily News Paper
RNI . TELTEL / 2022 / 83463

# బిఆర్ఎస్ పార్టీకి సురేష్ నాయక్ రాజీనామా

**-దయాకర్ రావు వీరభిమానిగా 14 ఏండ్లు ఎనలేని సేవలు చేసా**
**-బిఆర్ఎస్ లో గుర్తింపు లేదు**
**-గిరిజనుల ఎదుగుదలను అడ్డుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి**
**-ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అభివృద్ధిని చూసి కాంగ్రెస్ లో చేరుతున్నా**
**-ఇన్ని రోజులు తనకు బిఆర్ఎస్ లో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు**



**తరంగాలు ప్రతినిధి/పాలకుర్తి :** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గిరిజనులను అభివృద్ధి చేయలేదని తన దోర పోకడ విధానాలు నచ్చక బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఎర్రబెల్లి వీరాభిమాని లాకవత్ సురేష్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ ఎర్రబెల్లి దయాకర్ రావు కు 14 ఏండ్లు ఎనలేని సేవలు అందించానని ఇప్పటివరకు బిఆర్ఎస్ పార్టీలో ఎర్రబెల్లి తన కష్టాన్ని సేవలను గుర్తించలేదని ఆరోపించారు. మా గిరిజన జాతి బిడ్డలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నియోజకవర్గం స్థాయిలో గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం కాంట్రాక్టర్లని, పెట్టుబడి దారులను, పెత్తందారులు మరియు అగ్రకులాలను మాత్రమే డెవలప్మెంట్ చేసిన పార్టీ బిఆర్ఎస్ అని అన్నారు.ఇటువంటి పరిస్థితులలో ప్రజా సేవకోసం ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి చెందుతున్న సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అభివృద్ధి పనులను చూసి వారి నాయకత్వంలో పని చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఇన్ని రోజులు తనకు బిఆర్ఎస్ లో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# రాజకీయంలోనే కాదు దైవచింతనలోనూ ముందంజ


**-ఆలయానికి తబ్లాలు, హార్మోణియం అందజేసిన..**
**-మాజీ ఎంపీపీ అన్మగల్ల నర్సింలు**
**-మాజీ సర్పంచ్ కప్పెరి బచ్చిరెడ్డి**



**రాజాపూర్, తరంగాలు :** రాజకీయంలోనే కాదు... దైవచింతనలోనూ ముందువరుసలో ఉంటారు మాజీ ఎంపీపీ అన్మగల్ల నర్సింలు, మాజీ సర్పంచ్ కప్పెరి బచ్చిరెడ్డి.రాజకీయపరంగా ఎంత బిజీగా ఉన్నా... దైవభక్తికి సమయాన్ని కేటాయిస్తూ.. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు వారిరువురు.ఒకరు మాజీ ఎంపీపీగా.. మరొకరు మాజీ సర్పంచ్ గా కొనసాగి వారికి తోచిన సహాయ సహకారాలు అందిస్తూ... దైవ భక్తిలోనూ రాణిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పవచ్చు. శ్రీ శివ సీతారామ ఆంజనేయ స్వామి ఆలయ పునః నిర్మాణంలోను గ్రామ పెద్దలు.. యువకుల సమన్వయంతో వారు ముఖ్యపాత్ర పోషించారు. శనివారం రాత్రి రాజాపూర్ మండల కేంద్రంలోని శ్రీ శివ సీతారామాంజనేయ స్వామి ఆలయానికి మాజీ ఎంపీపీ నర్సింలు తబ్లాలు అందజేయగా... మాజీ సర్పంచ్ కప్పెరి బచ్చిరెడ్డి హార్మోనియం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక భావనను కూడా పెంపొందించుకోవాలన్నారు. ఎవరు చేసే వృత్తిలో వారు బిజీగా ఉన్నా దైవ భక్తి కోసం కొంత సమయాన్ని కేటాయిస్తే ప్రజల్లో భక్తి భావం పెంపొందించడంతోపాటు... ముక్తి లభిస్తుందని అన్నారు. అనంతరం భజన బృందం సభ్యులు మాట్లాడుతూ మాజీ ఎంపీపీ అన్మగల్ల నర్సింలు, మాజీ సర్పంచ్ కప్పెరి బచ్చిరెడ్డి రాజకీయంగా రాణిస్తూ... దైవ చింతనలోనూ తమ భక్తిని చాటుతున్నారని.. భజన బృందం సభ్యులు కోరిన తడువే ఒకరు తబలాలు అందజేయగా మరొకరు హార్మోణియం అందించి భజన కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో మాజీ ఎంపీపీ అన్మగల్ల నర్సింలు, మాజీ సర్పంచ్ బచ్చిరెడ్డిని భజన బృందం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వనపర్తి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి అచ్చయ్య, భజన బృందం సభ్యులు కటిక శ్రీనివాసులు, గొల్లపల్లి పెంటయ్య, కుమ్మరి కృష్ణయ్య, వాస జగతయ్య, కప్పెరి సత్యనారాయణ రెడ్డి, వనపర్తి సత్తయ్య, నారాయణరెడ్డి, కుమ్మరి మల్లయ్య, సున్నపు నర్సింలు తదితరులు ఉన్నారు.

# బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు

**-బడ్జెట్ లో బీసీలకు మొండి చేయి చూపించిన కాంగ్రెస్ సర్కార్**
**-బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, బాదేపల్లి ప్యాక్స్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్**



**జడ్చర్ల తరంగాలు :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో బీసీ కులాలకు కాంగ్రెస్ సర్కార్ మొండి చేయి చేయించిందని, అలాగే అన్ని రకాల కులవృత్తులను విస్మరిస్తుందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు, బాదేపల్లి ప్యాక్స్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. ఆసరా పెన్షన్స్, దళితులకు, గిరిజనులకు, గొల్ల కుర్మలకు, ముదిరాజ్ తదితర కులాలకు అన్యాయం చేశారని అన్నారు. దళిత బంధును 10 లక్షలు మాజీ సీఎం కెసిఆర్ ఇస్తే కాదు మేము దళితులకు 12 లక్షలు ఇస్తమని ఎన్నికల్లో ఓటు వేయించుకొని బయటపడ్డాక ప్రజలను విస్మరిస్తున్నారని విమర్శించారు. బడ్జెట్లో ఎక్కడ దళిత బంధుపథకం గురించి ప్రస్తావన లేదని అన్నారు. వృద్ధులకు, వికలాంగువాలకు పెన్షన్స్ పెంచుతారని అనుకున్నారని, కానీ వాళ్లకు కూడా పెంచడానికి ఎక్కడ మాట్లాడలేదని పేర్కొన్నారు. బడ్జెట్లో బీసీ వాళ్లకు కులావృత్తుల పేరిట లక్ష రూపాయల సహాయం చేద్దామని ఆలోచించిన కెసిఆర్ ని కాదని ప్రజలు కాంగ్రెస్ కి ఓట్లు వేసినందుకు వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట 20 వేల కోట్లు పెడుతామాని చెప్పి కేవలం 7 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. గతంలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులను కలుపుకొని కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసి అందరికీ సమ ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఫ్రీ బస్సు, 200 రూపాయల విద్యుత్, 500 రూపాయల సిలిండర్ ఇలాంటి పథకాలు కాదు అని.. జిల్లాలో ఉన్న పాలమూరు ఎత్తి పోతల పథకానికి నిధులు కావాలని, ప్రాజెక్టులు పూర్తిచేయాలని పాలెం సుదర్శన్ గౌడ్ డిమాండ్ చేశారు.

# కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుల ధైర్య సాహసాలు గొప్పవి

**-కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుడిని సన్మానించిన తోటి మిత్రులు**



**రాజాపూర్, తరంగాలు :** భారత సైన్యం కార్గిల్ లో పాక్ సైన్యాన్ని ఓడించి చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా ఆదివారం రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఆర్మీ సైనికుడు సయ్యద్ అలీని చిన్ననాటి మిత్రులు రాజాపూర్ మండల కేంద్రంలోని అగస్త్య పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్-పాకిస్థాన్ మధ్య కార్గిల్ యుద్ధం 1999 జూలై నెలలో జరిగిన 60 రోజుల సుదీర్ఘ కార్గిల్ యుద్ధంలో విజయ పతాకాన్ని ఎగురవేసిన భారత దేశ సైనికుల ధైర్య సాహసాలు గొప్పవని అభివర్ణించారు.తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పాక్ సైన్యాన్ని ఓడించిన మన దేశ సైనికుల త్యాగాలు వర్ణించలేనివన్నారు. అనంతరం నాటి కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన భారతదేశ సైనికుల త్యాగాలను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. మాజీ ఆర్మీ సైనికుడు సయ్యద్ అలీని సన్మానించిన వారిలో ప్రవీణ్ కుమార్, నసీర్ బేగ్. సురేష్ చారి, శ్రీశైలం, తదితరులు ఉన్నారు.

# నిరుపేద కుటుంబానికి అండగా

**-ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**



**తరంగాలు ప్రతినిధి/రాయపర్తి:** రాయపర్తి మండలం,మైలారం గ్రామంలోనీ నిరుపేద కుటుంబానికి చెందిన గబ్బెట వెంకటయ్య తల్లి గబ్బెట లక్ష్మి అనారోగ్యం మృతి చెందింది.విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు వారి ప్రతినిధులు నిత్యవసర సరుకులు, ఒక క్వింటా బియ్యం ఆ కుటుంబానికి అందజేహారు.వీటితో పాటు మండలంలోని తిరుమలాయపల్లి, కొండూరు, మైలారం, జగన్నాథ్ పెల్లి గ్రామాల్లో ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు వారి ప్రతినిధులతో నిర్వహించారు.నిరుపేదలపాలిట పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్నా అంటే నేనున్నానని నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటూ నిరుపేద కుటుంబాలకు తన ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలే ప్రాణం అంటూ ప్రజల కష్టసుఖాలు పాలుపంచుకుంటూ నేనున్నాను అంటూ ఏ కార్యక్రమానికైనా పేదల చేతుల మీదుగా చేయిస్తూ తన ఫౌండేషన్ ద్వారా అనేక కుటుంబాల జీవితాలలో వెలుగులు నింపుతున్న ఎస్ ఆర్ ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి కి బాధ్యత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కిరణ్ కుమార్ రెడ్డి ,ఎస్టీ సెల్ అధ్యక్షులు సురేంద్ర రాథోడ్ నాయక్, సుధాకర్, లేతకుల మధుకర్ రెడ్డి, లేతకుల సుధాకర్ రెడ్డి, గబ్బెట బాబు, వెంకన్న, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గిరిజనుల బోనాల వేడుకలు

**-వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ సునీత శ్రీనివాస్ నాయక్, యువ నాయకులు రాఘవేందర్ నాయక్**





**రాజాపూర్ తరంగాలు** రాజాపూర్ మండలంలోని సింగమ్మగూడ గ్రామపంచాయతీలోని ఆయా గిరిజన తండాలలో ఆదివారం గిరిజనులు బోనాల పండగలో భాగంగా మరియమ్మ, సేవాలాల్ మహారాజ్ వేడుకల సందర్భంగా నూతన దుస్తులను ధరించి తమ సాంప్రదాయాలు ఉట్టి పడే విధంగా భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు. సింగమ్మగూడ తండా తోపాటు అంజమ్మ తండా, రాయికుంట తండా, విస్లావత్ తండా, హేమ్ల తండాల్లో మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఈ బోనాల వేడుకల్లో పాల్గొని, పలు వేషధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. అనంతరం గిరిజనుల ఆరాధ్య దేవమైన సేవాలాల్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదలకు పెద్దపీట

**-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరి సింగ్ నాయక్**
**-ఎస్సీ ఎస్టీ నిధులు పెంచడం పట్ల హర్షం**



**బాలానగర్ తరంగాలు :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, బడ్జెట్లో అన్ని వర్గాలకు పెద్దపీట వేశారని, ముఖ్యంగా పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకొస్తున్నారని బాలనగర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరిసింగ్ నాయక్ అభిప్రాయ పడ్డారు. అంతేకాకుండా రాష్ట్ర బడ్జెట్లో గత ప్రభుత్వం కంటే ఎక్కువ నిధులు ఎస్సీ ఎస్టీ వర్గాలకు కేటాయింపులు చేయడం హర్షణీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ సర్కార్ దీర్ఘ దృష్టితో పథకాల అమలు చేస్తూ ఆదర్శవంతమైన పాలన అందిస్తుందని హరి సింగ్ అభిప్రాయపడ్డారు. ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిపక్షాలు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## బర్త్ డే స్పెషల్..
## ధనుష్ కుబేర నయా లుక్ వైరల్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ డైరెక్ట్ చేస్తూ లీడ్ రోల్‌లో నటించిన రాయన్ మంచి టాక్ తెచ్చుకుంటోంది. డైరెక్టర్‌గా మంచి మార్కులు కొటేశాడు ధనుష్. కాగా ఈ స్టార్ హీరో బ్యాక్ టు బ్యాక్ కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండగా.. వీటిలో ఒకటి కుబేర 51గా తెరకెక్కుతున్న ఈ మూవీని టాలీవుడ్ డైరెక్టర్ శేఖర్‌కమ్ముల డైరెక్ట్ చేస్తున్నాడు. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. అక్కినేని నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నాడు. ధైర్యవంతులనే అదృష్టం వరిస్తుంది.. అనే క్యాప్షన్‌తో ఇప్పటికే షేర్ చేసిన చెదిరిన వెంట్రుకలు, మాసిన గడ్డంతో నవ్వుతూ కనిపిస్తున్న ధనుష్ కుబేర ఫస్ట్ లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తోంది. తాజాగా ధనుష్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. స్పెషల్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ధనుష్ గుబురు గడ్డం, మాసిన చొక్కాలో అమాయకంగా కనిపిస్తూ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పీ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. సోషల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న కుబేర ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. కొన్ని రోజుల క్రితం ముంబై షెడ్యూల్‌లో ధనుష్, రష్మిక మందన్నాపై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. మరోవైపు హైదరాబాద్‌లో ధనుష్, అక్కినేని నాగార్జున మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలను కూడా షూట్ చేశారు.



## విజయ్‌ను చూసి చాలా భయపడ్డాను..
### -రౌడీ బాయ్ గురించి రష్మిక క్రేజీ కామెంట్స్

టాలీవుడ్ లో క్రేజీ పెయిర్ గా పేరు తెచ్చుకున్నారు విజయ్ దేవరకొండ రష్మిక. ఈ జంట స్క్రీన్ మీద కనిపిస్తే ఆడియన్స్ ఫుల్ ఖుష్ అయ్యారు. విజయ్ , రష్మిక కలిసి గీతగోవిందం సినిమాలో నటించారు. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. పరశు రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విజయ్, రష్మిక తమ నటనతో ప్రేక్షకులను మెప్పించారు. గీతగోవిందం సినిమా తర్వాత విజయ్ రష్మిక కలిసి డియర్ కామ్రేడ్ అనే సినిమా చేశారు. ఈ సినిమా థియేటర్స్ లో ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. కానీ ఓటీటీలో, టీవీలో చూసిన ప్రేక్షకులు సినిమా బాగుంది అని ఫీల్ అయ్యారు. విజయ్ కూడా ఈసినిమా ఎందుకు ఫ్లాప్ అయ్యిందో అర్థం కావడంలేదు అని ఎమోషనల్ కామెంట్స్ కూడా చేశారు. ఇక విజయ్ రష్మిక విషయానికొస్తే ఈ ఇద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ అంటూ చాలా కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరూ వెకేషన్స్ కు వెళ్తున్నారంటూ కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే విజయ్ గురించి రష్మిక ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఇటీవల రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు కొత్త వారితో మాట్లాడాలంటే కాస్త భయం, బెరుకు అని తెలిపింది. అందుకే గీతగోవిందం సినిమాలో విజయ్ దేవరకొండతో మాట్లాడాలంటే చాలా భయపడ్డాను అని తెలిపింది రష్మిక. మొదటి సారి విజయ్ ను కలిసినప్పుడు చాలా భయపడ్డాను. కానీ విజయ్ చాలా కూల్. అతను సెట్ లో ఉంటే చాలా సరదాగా ఉంటుంది. ఆ వాతావరణం మొత్తం పాజిటివ్ గా మారిపోతుంది. అందుకే షూటింగ్ అంతా చాలా సరదాగా సాగిపోతుంది. అందుకే ఆ సినిమా షూటింగ్ చాలా సాఫీగా సాగిపోయింది అని చెప్పుకొచ్చింది రష్మిక. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. రష్మిక ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా మారిపోయింది. పుష్ప 2 సినిమాతో పాటు, తమిళ్ లోనూ సినిమాలు చేస్తుంది రష్మిక. అలాగే బాలీవుడ్ లోనూ సినిమాలు చేస్తుంది రష్మిక. ఇక విజయ్ కూడా మూడు సినిమాలను అనౌన్స్ చేశాడు.

## డబ్బులిచ్చి పొగిడించుకుంటావ్.!
## జాన్వీ కపూర్ క్రేజీ ఆన్సర్.!

ప్రస్తుతం చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న హీరోయిన్లలో జాన్వీ కపూర్ ఒకరు. హిందీ, తెలుగులో బ్యాక్ టూ బ్యాక్ సినిమాల్లో నటిస్తోంది. ప్రస్తుతం యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తున్న దేవర చిత్రంలో నటిస్తుంది. అలాగే తెలుగులో ఆర్సీ 16, నాని కొత్త సినిమాల్లోనూ నటించనుందిఇటు తెలుగులో సినిమాలను ఓకే చేస్తూనే మరోవైపు హిందీలోనూ ఆఫర్స్ అందుకుంటుంది. అయితే సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్ గా ఉంటుంది జాన్వీ కపూర్. ఈ అమ్మడి హాట్ ఫొటోస్ నెట్టింట ఫుల్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా జాన్వీ కపూర్ కు సంబంధించి ఏదోక న్యూస్ సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఆమెను కొందరు సెలబ్రిటీలు పొగడడం కామన్ అయిపోయింది. దీంతో ఇదంతా సెల్ఫ్ డబ్బా.. పెయిడ్ ప్రమోషన్ అనే కామెంట్ కొంత మంది నెటిజెన్స్ నుంచి గట్టిగా వస్తోంది. అది కాస్త ఎక్కువగా వినిపించే సరికి.. ఈ కామెంట్ పై తాజాగా రియాక్టైంది ఈ బ్యూటీ. ఎవరైనా సోషల్ మీడియాలో తనను పొరపాటున పొగిడితే వాళ్లకు తాను డబ్బులిస్తున్నానని అంటున్నారు. వాళ్లు నా పీఆర్ టీమ్ కాదు.. డబ్బు ఇచ్చి మరీ పొగిడించుకునేంత బడ్జెట్ నా దగ్గర లేదంటూ చెప్పుకొచ్చింది జాన్వీ.







## మారుతి నగర్ సుబ్రమణ్యం ఏజ్‌బార్ కష్టాలు!

ట్రైలర్‌లో మారుతి నగర్ వాసి సుబ్రహ్మణ్యానికి ఎటకారం ఎక్కువ అని తెలుస్తుంది. ఉదయాన్నే కిటికీ నుంచి వస్తున్న పొగలు చూసిన పొరుగింటి వ్యక్తి 'పొద్దున్నే పూజ మొదలు పెట్టావా? అగరబత్తి పొగలు కక్కుతోంది' అని అడిగితే గోల్డ్ ఫ్లాక్ కింగ్ అని కొత్త బ్రాండ్ అగరబత్తి. నీ కూతురు వాడుతుంటే చూసి కొన్నాను' అని చెబుతాడు. టైటిల్ రోల్ రావు రమేష్ చేయగా ఆయన భార్యగా ఇంద్రజ కనిపించారు. భర్త సిగరెట్లకు భార్య డబ్బులు ఇస్తోందని ఈ రోజు నుంచి మీ సిగరెట్ ఖర్చులకు నేను డబ్బులు ఇవ్వను అని ఇంద్రజ డైలాగ్ చెప్పడంతో అర్థం అవుతుంది. ఆ వెంటనే నీకు అదృష్టం ఆవగింజ అంత ఉంటే దురదృష్టం ఆకాశమంత ఉందిరా బాబు అని అన్నపూర్ణమ్మ చెప్పారు. ఆవిడ రావు రమేష్ అత్తగారి పాత్ర చేశారు. సుబ్రమణ్యం కుమారుడు ఏమో 'మా నాన్న అల్లు అరవింద్' అని గొప్పలు చెప్పి ఓ డబ్బున్న అమ్మాయిని ప్రేమలో పడేశాడు ఇలా ట్రైలర్ ఫన్‌గా కొనసాగింది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఆగస్టు 23న విడుదల చేస్తుంది. దర్శకుడు మాట్లాడుతూ కంటెంట్ ఓరియెంటెడ్ ఫిల్మ్ ఆ కంటెంట్ ఒక ఎత్తు అయితే రావు రమేష్ నటన మరొక ఎత్తు. టిపికల్ డైలాగ్ డెలివరీతో సుబ్రమణ్యం పాత్రలో జీవించారు. 'అవన్నీ ఓకే' అని డైలాగ్ చెప్పడంలో, నుదుట నామాలు పెట్టి కుర్చీ తీసిన సన్నివేశంలో ఆయన చూపించిన యాటిట్యూడ్ నెవ్వర్ బిఫోర్ ఎవ్వర్ ఆఫ్టర్. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి సైతం తమ నటనతో ఆకట్టుకున్నారు. డైలాగులు బావున్నాయి. సినిమాపై ఈ ట్రైలర్ మరిన్ని అంచనాలు పెంచింది' అని చెప్పారు. క్యారెక్టర్ నటుడు రావు రమేష్ కథానాయకుడిగా మారిపోయాడు.. ఆయన టైటిల్ పాత్రలో నటించిన చిత్రం మారుతి నగర్ సుబ్రమణ్యం. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి పాన్ ఇండియా దర్శకుడు తబితా సుకుమార్ సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ చిత్రం ట్రైలర్ కథానాయకుడు రామ్‌చరణ్ సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ చిత్రం ట్రైలర్ చూస్తుంటే ఈ చిత్రంలో రావు రమేష్ తండ్రి పాత్రలో నటించినట్టుగా కనిపిస్తుంది.

## విక్కీ కౌశల్, తృప్తి డిమ్రి బ్యాడ్ న్యూజ్ మైల్‌స్టోన్

విక్కీ కౌశల్, యానిమల్ ఫేం తృప్తి డిమ్రి కాంబోలో వచ్చిన చిత్రం బ్యాడ్ న్యూజ్ ( Bad Newz ). అమ్మి విర్క్ మరో లీడ్ రోల్ పోషించాడు. ఆనంద్ తివారి దర్శకత్వం వహించిన ఈ మూవీలో నేహా ధూపియా కీలక పాత్రలో నటించింది. జులై 19న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీకి మంచి స్పందన వచ్చింది. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ చిత్రం శుక్రవారం రూ. 2.22 కోట్లు రాబట్టింది. శనివారం రూ. 3.52 కోట్లు రాబట్టగా.. ఈ ఫిగర్‌తో మొత్తం కలెక్షన్లు రూ. 49.86 కోట్లకు చేరాయి. సెకండ్ వీకెండ్ కల్లా బ్యాడ్‌న్యూజ్ రూ. 50 కోట్ల క్లబ్‌లోకి ఎంటరవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. హాలీవుడ్ సూపర్ హీరో ఫిల్మ్ డెడ్‌పూల్ అండ్ వాల్వెరిన్ థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో బ్యాడ్ న్యూజ్ ప్రయాణం ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది.



Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com